ఓం

# పద్యపుష్పాలు

## భారత భాగవత రామాయణ పద్యాలు


*సంకలనం - వివరణ*

మహామహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్య



*ప్రచురణ*

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2017**

**PADYAPUSHPALU**
**Bharatha Bhagavatha Ramayana Padyalu**

***by***

**Dr. Samudrala Lakshmanaiah**

T.T.D. Religious Publications Series No.1262
© All Rights Reserved
*First Print :* 2017

*Copies :* 1000

*Published by :*
**Sri Anil Kumar Singhal**, I.A.S.
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati

*D.T.P.*
Publications Division
T.T.D., Tirupati.

*Printed at*
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507

# ముందుమాట

విషయాసక్తమయి సంక్షుభితమౌతున్న ఈ సమాజంలో నిరంతరం మనిషి పరిభ్రమిస్తూ ఉంటాడు. లౌకిక విషయ పరంపరలు చుట్టుముట్టి అతని మనస్సును మలినపరుస్తూ ఉంటాయి. అందువల్ల మనిషి నిరంతరం అలా అంటిన మాలిన్యాన్ని ఏదో ఒక మార్గంలో కడిగివేసుకుంటూ మనస్సును పరిశుద్ధం చేసుకుంటూ ఉండాలి. అందుకోసం మనపూర్వులు ఎంతో గ్రంథ సముచ్చయాన్ని మనకు ప్రసాదించారు. ఆ గ్రంథ సముచ్చయంలో భారతం, భాగవతం, రామాయణం ప్రధానంగా చెప్పుకోదగ్గవి. ఋషితుల్యులైన వ్యాసవాల్మీకులు సంస్కృత భాషలో చెప్పగా నన్నయాది కవులు ఆ గ్రంథాలను తెలుగులోకి అనువదించి మనకందించారు.

మహాభారతం పంచమవేదమని రూఢికెక్కింది. భాగవతం భగవద్దాసుల కథలు వివరిస్తూ శ్రీమహావిష్ణువు యొక్క అవతార విశేషాలను తెలియజేస్తూ ఉంది. స్వయంగా పరమాత్మ విరాడ్రూపమే భాగవతం. వేదమే రామాయణంగా అవతరించింది. వేదపురుషుడైన పరమాత్మ శ్రీరామచంద్రుడుగా అవతరించి సంపూర్ణ మానవ స్వరూపాన్ని ప్రకటించిన గాథయే రామాయణం. ఈ మూడు మహాగ్రంథాలలో మానవుడు లౌకిక సమాజంలో ఎలా నడచుకోవాలో తెలిపే ఘట్టాలు పుష్కలంగా ఉన్నాయి. లౌకిక నీతుల్ని బోధించే ఆణిముత్యాల్లాంటి పద్యాలు అందులో సహస్ర సంఖ్యలు లభిస్తాయి.

మహామహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్యగారు శ్రీవేంకటేశ్వరుని సన్నిధానంలో దశాబ్దాలుగా ధార్మిక సాహిత్యసేవ చేస్తున్నారు. వారు పై మూడు గ్రంథాల్లోని అపురూపమైన పద్యాలను ఏరి వాటికి తాత్పర్యాలు

సమకూర్చి తిరుమల తిరుపతి దేవస్థానానికి సమర్పించారు. వారి రచన మృదుమధురంగా పఠన యోగ్యంగా ఉంటుంది.

డా॥ సముద్రాలవారి ఈ పద్యపుష్పాలు (భారత భాగవత రామాయణ పద్యాలు) రచనను తిరుమల తిరుపతి దేవస్థానములు ముద్రించి తెలుగు పాఠకులకు అందిస్తూ ఉంది. తి.తి.దే. ప్రచురణలను యథాపూర్వంగా ఆదరించినట్లే పాఠకులు ఈ రచనను గూడ ఆదరించగలరని ఆకాంక్షిస్తున్నాము.

సదా శ్రీవారి సేవలో....



**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

# నివేదన

మహామహోపాధ్యాయ
**డా॥ సముద్రాల లక్ష్మణయ్య**
తిరుపతి

ఏ భాషకైనా వైభవం కలిగించేది ఆ భాషలోని వాఙ్మయమే. వాఙ్మయాన్ని దండి మహాకవి దర్పణంతో పోల్చాడు. దర్పణంలో బింబం ప్రతిబింబిస్తుంది. అట్లే వాఙ్మయంలో గతచరిత్ర ప్రతిఫలిస్తుంది. విశేషమేమంటే, అలా ప్రతిఫలించిన చరిత్ర శాశ్వతంగా ఉండిపోతుంది.

నాటి శ్రీరాముడు, శ్రీకృష్ణుడు ఇప్పుడు లేరు. కాని వారి చరిత్రలు రామాయణం, భాగవతం మున్నగు గ్రంథాలలో స్థిరంగా ఉన్నవి.

గతచరిత్రను ఎన్నటికీ విస్మరించరాదు. "పురోభివృద్ధి కోరువారు పూర్వ వృత్తాంతాన్ని మరువరాదు" అని శ్రీసద్గురు మలయాళస్వామి సూక్తి.

వాఙ్మయం గద్యమయం, పద్యమయం, గద్యపద్యోభయమయం అని మూడు విధాలుగా ఉంటుంది. గద్యానికి ఛందస్సుతో పనిలేదు. ఛందస్సు లేకుంటే పద్యానికి ఉనికి లేదు. ఛందోబద్ధమైన పద్యం ఎంతో హృద్యమై శ్రోతలను ఆకర్షిస్తుంది.

వేదానికి గల ఆరు అంగాలలో ఛందస్సు ఒకటి. అపౌరుషేయంగా భావింపబడుతున్న వైదికవాఙ్మయంలో ఛందోబద్ధమైన సాహిత్యం పుష్కలంగా లభిస్తున్నది.

ఇక లౌకికవాఙ్మయంలో ఛందోబద్ధమైన వాణి ఆదికవి వాల్మీకి వదనారవిందంనుండే తొలిసారిగా వెలువడింది. ఆ కవికోకిల రచించిన రామాయణం అజరామరమైన ఆదికావ్యంగా రాణిస్తున్నది.

గణబద్ధమైన పద్యాలు చదవడానికీ, వినడానికీ, వినిపించడానికీ, కంఠస్థం చేసుకోవడానికీ ఎంతో అనువుగా వుంటాయి. ఆదికవి మార్గంలో నడిచిన తదనంతర కవులు వివిధ భాషలలో రసవత్తరమైన పద్యరచనలు కావించి ధన్యులయ్యారు.

కవిత్రయంలో మొదటివాడు నన్నయ్య. ఆయన రచించిన రెండున్నర పర్వాల మహాభారత భాగమే తెలుగులో ప్రథమగద్యపద్య కృతిగా ప్రసిద్ధి పొందింది. అందుకే ఆంధ్రు లాయనను పద్యవిద్యకు ఆద్యుడని ప్రశంసించారు.

పద్యరూపం దాల్చిన సుమతి శతక, వేమన శతకాదులు బహుళవ్యాప్తి పొందడానికి కారణం అందలి భావపుష్టితో పాటు పద్యనిర్మాణ సౌందర్యమే.

విద్యార్థులకు గద్యభాగాలే కాక పద్యభాగాలు గూడా పాఠ్యాంశాలుగా తప్పని సరిగా వుండాలి. బాల్యంలో విద్యార్థులు పద్యాలను సులభంగా కంఠస్థం చేసుకొంటారు. చిన్న వయస్సులో నేర్చుకొన్న పద్యాలు చివరి వరకూ స్మృతిపథం నుండి తొలగవు. పద్యాలను ఎంత ఎక్కువగా నేర్చుకొంటే అంత ఎక్కువగా భాషపై అభిరుచి కల్గుతుంది, పట్టు లభిస్తుంది. వాఙ్మయంలో తగినంత పాండిత్యం సిద్ధిస్తుంది. స్మరణశక్తి పెంపొందుతుంది.

పూర్వం వీథిబళ్ళలో చదివే బాలురచే ఉపాధ్యాయులు అనేక స్తోత్రాలు, నీతిపద్యాలు కంఠస్థం చేయించేవారు. ఆ సంప్రదాయం నేడు లేకపోవడం శోచనీయం.

పోతన భాగవతంలోని గజేంద్రమోక్షణం, రుక్మిణీకల్యాణం, వామన చరిత్ర వంటి భాగాలలోని పద్యాలు ఆంధ్రావనిలో విస్తృత ప్రచారం పొందాయి. అందలి కవితా మాధుర్యం ఆ రచనకంతటి వ్యాప్తి కల్గించింది.



మన మాతృభాషలోని అందచందాలు మనకు ఆనందం కల్గించాలంటే ఇంపైన పద్యరచనలను విరివిగా చదవాలి. ఆధునిక కాలంలో గూడా శ్రీజాషువా, శ్రీజంధ్యాల పాపయ్యశాస్త్రి వంటి కవులు తెలుగులో అత్యద్భుతమైన పద్యరచనలు చేశారు.

నేటి బాలురకు పద్యాలు సుపరిచితాలు కావాలన్న సదుద్దేశంతోనే తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన ప్రచురణల విభాగం వారు భారత–భాగవత–రామాయణాదుల నుండి 100 పద్యాలను తాత్పర్య సహితంగా ప్రచురించాలని నిర్ణయించారు.

ఈ నిర్ణయాన్ని అప్పటి ప్రచురణ విభాగ ప్రత్యేకాధికారి శ్రీ ప్రయాగ రామకృష్ణగారు నాకు తెలియజేసి ఆ పని పూర్తిచేయవలసినదిగా నన్ను కోరారు. నేను అందుకంగీకరించాను. తెలుగులో భారత భాగవతాలు సుప్రసిద్ధాలు. కాని ఏ రామాయణమూ అంత ప్రసిద్ధం కాదు. ఉన్న వాటిలో ప్రాచీనమూ, రసవత్తర రచనాశోభితమూ అయినది భాస్కరరామాయణమని నా భావన. అందువల్ల భారతభాగవతాలతోపాటు భాస్కరరామాయణం నుండి కూడ కొన్ని పద్యాలు ఎన్నుకొన్నాను. అన్ని పద్యాలకూ సందర్భమూ, తాత్పర్యమూ జోడించి ఈ గ్రంథాన్ని రూపొందించడం జరిగింది. సాధ్యమైనంత వరకూ సులభశైలిలోనే రచన కొనసాగింది.

ప్రశంసనీయమైన ఈ పద్యప్రచురణ కార్యక్రమాన్ని ఆమోదించిన తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ అనిల్ కుమార్ సింఘాల్, ఐ.ఎ.ఎస్. గారికీ, తగిన ప్రోత్సాహమిచ్చిన సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ పోలా భాస్కర్, ఐ.ఎ.ఎస్. గారికీ కృతజ్ఞతాభివందనాలు.

ప్రచురణ విభాగ మాజీ ప్రత్యేకాధికారి శ్రీ రామకృష్ణగారికీ, నేటి ప్రత్యేకాధికారి ఆచార్య తాళ్లూరి ఆంజనేయులుగారికీ, సంధానకర్త డా॥ నొస్సం నరసింహాచార్యులవారికీ నా కృతజ్ఞతలు.

బాలబాలికలే కాక జిజ్ఞాసువులైన పెద్దలుగూడ ఈ పద్యాలను భావసహితంగా పఠించి పద్యవిద్యాప్రశస్తిని గ్రహించి దేవస్థానంవారి సత్సంకల్పాన్ని సఫలం చేయగలరని ఆశిస్తున్నాను.

* * *

# మహాభారత పద్యాలు

మహాభారతం మొదట సంస్కృతంలో రచింపబడింది. వ్యాసుడు రచించిన ఈ గ్రంథంలో 18 పర్వాలు, లక్ష శ్లోకాలు ఉన్నాయి. దీనిని పంచమవేదమని కీర్తిస్తారు.

నన్నయ, తిక్కన, ఎఱ్ఱన అను ముగ్గురు కవులు భారతాన్ని తెలుగులోకి అనువదించారు. నన్నయ రెండున్నర పర్వాలు, తిక్కన విరాటపర్వంనుండి గ్రంథాంతం వరకూ 15 పర్వాలు, ఎఱ్ఱన ఆరణ్యపర్వశేషం అనువదించి కవిత్రయంగా వినుతి కెక్కారు.

## 1

*నన్నయ అనువదించిన ఆదిపర్వంలో తొలుత ప్రార్థనాపద్యంగా ఈ క్రింది శ్లోకం రచించబడింది. ఇందులో లక్ష్మీ సరస్వతీ పార్వతీ సహితులైన త్రిమూర్తులు లోకానికి శ్రేయస్సు కల్గింతురుగాక! అని ప్రార్థించడమైనది. గ్రంథాదిలో ఇష్టదైవాన్ని ప్రార్థిస్తూ కవులు పద్యాలు వ్రాయడం సంప్రదాయమై యున్నది.*

**శ్రీవాణీగిరిజా శ్చిరాయ దధతో వక్షోముఖాంగేషు యే**
**లోకానాం స్థితి మావహన్త్యవిహతాం స్త్రీ పుంసయోగోద్భవామ్,**
**తే వేదత్రయ మూర్తయ స్త్రిపురుషా స్సంపూజితా వ స్సురై**
**ర్భూయాసుః పురుషోత్తమాంబుజభవశ్రీకంధరా శ్రేయసే. (1-1)**

వక్షస్థలమందు, ముఖమందు, శరీరమునందు లక్ష్మిని, సరస్వతిని, పార్వతిని ధరించువారై, స్త్రీపురుషుల కలయికవలన పుట్టిన లోకాల స్థితిని అవిచ్ఛిన్నంగా నిర్వహిస్తున్నవారై, వేదత్రయమూర్తులై, దేవతలచే పూజింప బడినవారై విలసిల్లుతున్న విష్ణువు, బ్రహ్మ, శివుడు అనే త్రిమూర్తులు మీకు శ్రేయస్సు కలిగింతురుగాక!

## 2

*తిక్కన రచించిన భారతంలోని విరాటపర్వంలో ఈ క్రిందిది మొదటి పద్యం. ఇది ప్రార్థనారూప మైనది. సృష్టికీ, స్థితికీ, సంహారానికీ కర్తలైన బ్రహ్మ, విష్ణువు, శివుడు అనువారు త్రిమూర్తులుగా ప్రసిద్ధులు. ఇక్కడ శివుడు, కేశవుడు అను దేవతలు పరబ్రహ్మస్వరూపులుగా వర్ణించబడినారు. కొందరు శివభక్తులు, మరికొందరు విష్ణుభక్తులై ఆయా దేవతలకు నమస్కరిస్తారు. తిక్కన అలా కాక శివకేశవు లిరువురూ అభిన్నమైన పరతత్త్వస్వరూపులని చెప్పి వారిని సేవిస్తున్నానని చెప్పినాడు. శివునికీ, కేశవునికీ అభేదం ప్రతిపాదించే కవియొక్క భావన ప్రశంసింపదగినది.*

**శ్రీయన గౌరి నాఁబరఁగు చెల్వకుఁ జిత్తము పల్లవింప భ**
**ద్రాయితమూర్తియై హరిహరంబగు రూపముఁదాల్చి విష్ణురూ**
**పాయ నమశ్శివాయ యని పల్కెడు భక్తజనంబు వైదిక**
**ధ్యాయిత కిచ్చు మెచ్చు పరతత్త్వముఁ గొల్చెద నిష్టసిద్ధికిన్. (4-1)**

లక్ష్మి యనీ, పార్వతి అనీ ప్రసిద్ధి పొందిన మహిళామణి చిత్తం వికసించునట్లుగా మంగళస్వరూపుడై, హరి- హరాత్మకమైన ఆకృతి ధరించినవాడై, విష్ణురూపాయ శివాయ నమః (విష్ణురూపంతో ఉన్న శివునికి నమస్కారం) అని తనకు నమస్కరించే భక్తజనుల వైదికమైన ధ్యాననిష్ఠకు మదిలో మెచ్చే పరబ్రహ్మమును అభీష్టాలు సిద్ధించుటకై సేవిస్తాను.

## 3

*కురుక్షేత్రంలో జరిగిన యుద్ధముయొక్క తీరుతెన్నులను వ్యాసుని అనుగ్రహంచేత చక్కగా గ్రహించిన సంజయుడు ఎప్పటి కప్పుడు ధృతరాష్ట్రునికి తెలియజేస్తూ వచ్చాడు. పదిదినాలు యుద్ధం చేసి నేలకొరిగిన భీష్ముని వృత్తాంతాన్ని తెలిపి వేదవ్యాసుని పాదాలకు నమస్కరించి తదుపరి*



*వృత్తాంతాన్ని తెలియజేస్తానని సంజయు డనగా ధృతరాష్ట్రుడు 'సరే అట్లే చెప్పు' అన్నాడు. అంతట సంజయుడు వ్యాసుని స్మరించి యుద్ధవృత్తాంతం చెప్పబూనుకొన్నాడు. ఆ వ్యాససంస్మరణమే ఈ పద్యం. వేదవ్యాసుని స్వరూపాన్ని చక్కగా నిరూపించిన ఈ పద్యం భీష్మపర్వం ప్రథమాశ్వాసం లోనిది.*

**ప్రాంశుఁ బయోదనీలతనుభాసితు నుజ్జ్వలదండధారుఁ బిం**
**గాంశు జటాచ్ఛటాభరణు నాగమపుంజ పదార్థతత్త్వ ని**
**స్సంశయకారుఁ గృష్ణమృగచర్మకృతాంబరకృత్యు భారతీ**
**వంశవివర్ధనుం ద్రిదశవందితు సాత్యవతేయుఁ గొల్చెదన్. (6-1-71)**

ఉన్నతమైనవాడూ, మేఘంవలె నల్లని శరీరంతో విలసిల్లేవాడూ, ప్రకాశించే దండాన్ని చేతబట్టినవాడూ, గోరోజనం రంగుగల జడలనే ఆభరణంగా దాల్చినవాడూ, వేదరాశియొక్క పదాల అర్థతత్త్వాన్ని సందేహాలు లేకుండా నిరూపించినవాడూ, కృష్ణాజినాన్ని వస్త్రంగా ధరించినవాడూ, విద్యావంశాన్ని వృద్ధిగావించినవాడూ, దేవతలచే నమస్కరించబడినవాడూ అగు సత్యవతీపుత్రుడైన వ్యాసుణ్ణి భజిస్తాను.

## 4

*విరాటపర్వం మొదటిభాగంలో తిక్కన రచించిన ఈ పద్యం ఆయన తన భారతానువాదాన్ని హరిహరస్వరూపు డైన పరమాత్మునికి అంకితమిస్తున్నట్లు స్పష్టం చేస్తున్నది. భగవద్విభూతి అయిన కవిత్వాన్ని భగవంతునికే సమర్పించడం అన్నివిధాలా అభినందింపదగియున్నది.*

**కూర్చుట నూత్నరత్నమునకుం గనకంబునకున్ దగున్ జనా**
**భ్యర్చితమైన భారత మపారకృపాపరతంత్రవృత్తి మైఁ**
**బేర్చిన దేవదేవునకుఁ బ్రీతిగ నిచ్చుట సర్వసిద్ధి నా**
**నేర్చిన భంగిఁజెప్పి వరణీయుఁడ నయ్యెద భక్తికోటికిన్.   (4-28)**

కొంగ్రొత్త రత్నానికీ, బంగారానికీ సంయోజనం చేయడం సముచితంగా ఉంటుంది. భారతం జనులచే పూజింపబడిన మహాగ్రంథం. హరిహర స్వరూపుడైన దేవాధిదేవుడు ఎల్లలు లేని దయకు పరతంత్రుడై విలసిల్లువాడు. ఆ దేవునకు నాయీ అనువాదరూపమైన రచనను ప్రీతితో సమర్పించడం సమస్త ప్రయోజనాలనూ సమకూరుస్తుంది. అందువల్ల నేను నా నేర్పు కొలది ఈ భారతమును చెప్పి భక్తబృందానికి వరింపదగినవాడ నవుతాను.

## 5

*కవిత్రయంలో చివరివాడైన ఎఱ్ఱన రచించిన ఆరణ్యపర్వంలోని పద్యమిది. సరస్వతీదేవియొక్క ప్రార్థన ఈ పద్యంలో పొందుపరచడ మయింది. మార్కండేయుడు ధర్మరాజుకు 'సరస్వతీగీత' అనే ఇతిహాసం చెప్పిన సందర్భంలో ఈ పద్యం ఉన్నది. తార్క్ష్యుడనే ముని సరస్వతి నారాధించగా ఆ దేవి అతని ముందు ప్రత్యక్షమయింది. అత డడిగిన ప్రశ్నలకు ఆ దేవి సమాధానాలు చెప్పింది. తార్క్ష్యముని ఆ దేవికి నమస్కరించి ఇలా ఆమెను ప్రార్థించాడు. ఇంచుమించు ఎఱ్ఱన రచన ప్రారంభదశలోనే ఈ పద్యం ఉండడం వల్ల ఆ కవిశ్రేష్ఠుడు సరస్వతి నుద్దేశించి చెప్పిన స్తుతిగా గూడా దీన్ని భావించవచ్చు.*

*ఈ పద్యం పోతన భాగవతం అవతారికలో గూడ కనిపిస్తున్నది.*

**అంబ! నవాంబుజోజ్జ్వల కరాంబుజ! శారదచంద్రచంద్రికా**
**డంబర చారుమూర్తి! ప్రకటస్ఫుటభూషణరత్నరోచి రా**
**చుంబితదిగ్విభాగ! శ్రుతిసూక్తవివిక్తనిజప్రభావ! భా**
**వాంబరవీథి విశ్రుతవిహారిణి! నన్ గృపఁజూడు భారతీ! (3-4-216)**

అమ్మా! క్రొత్త తామరలవలె విలసిల్లే హస్తపద్మాలు గలదానా! శరత్కాలంలోని చంద్రుని వెన్నెలవలె మిలమిలలాడే సుందరమైన ఆకృతి



గలదానా! స్పష్టంగా కనిపించే ఆభరణాలకు చెందిన రత్నాల కాంతులచేత స్పృశింపబడిన దిగంతాలు గలదానా! వేదాలలోని సూక్తాలచే ప్రకటితమైన నిజమహిమ కలదానా! ఆలోచనలనే ఆకాశవీథుల్లో ప్రశస్తంగా విహరించే దానా! సరస్వతీదేవీ! నన్ను దయతో జూడు.

## 6

*ఇది ఆదిపర్వ ప్రారంభంలో ఉన్నది. రాజరాజనరేంద్రుడు భారతంపై అత్యధికమైన ప్రీతికలవాడు. అత డొకనాడు నన్నయను చూచి తనకు గల భారతప్రీతిని వివరించి మహాభారతాన్ని తెనుగున రచించవలసినదిగా అర్థించాడు. ఆ సందర్భంలో భారతాన్ని వినడం వల్ల కలిగే ప్రయోజనాన్ని ఆ రాజు ఇలా వివరించాడు.*

**బహుభాషల బహువిధముల**
**బహుజనములవలన వినుచు భారతబద్ధ**
**స్పృహులగు వారికి నెప్పుడు**
**బహుయాగంబుల ఫలంబు పరమార్థముగున్. (1-17)**

అనేక భాషలలో, అనేక రీతులుగా, అనేక జనులనుండి భారతం వినాలి. అలా వింటూ భారతంపై ఆసక్తి గలవారికి ఎల్లవేళలా అనేక యాగాలు చేస్తే ఏ ఫలం సిద్ధిస్తుందో, అట్టి ఫలమే లభిస్తుందని భావం.

## 7

*వేదవ్యాసుడు రచించిన భారతాన్ని ప్రశంసించే పద్యమిది. పంచమ వేదంగా ప్రసిద్ధి గాంచిన ఈ మహాగ్రంథంలో ధర్మం, వేదాంతం, నీతి, కావ్యత్వం, లక్షణానికి తగిన లక్ష్యాలు, ఇతిహాసం, పురాణకథలు సమగ్రంగా ఉన్నవి. ఆదిపర్వంలోని భారతకథా ప్రస్తావనలో నన్నయ ఈ పద్యం చెప్పి వ్యాసభారత విశిష్టతను ఇలా తెలియజేశాడు.*

**ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని**
**యధ్యాత్మవిదులు వేదాంత మనియు**
**నీతి విచక్షణుల్ నీతిశాస్త్రంబని**
**కవివృషభులు మహాకావ్య మనియు**
**లాక్షణికులు సర్వలక్ష్యసంగ్రహ మని**
**యైతిహాసికు లితిహాస మనియుఁ**
**బరమపౌరాణికుల్ బహుపురాణసముచ్చ**
**యంబని మహిఁ గొనియాడుచుండ**

**వివిధ వేదతత్త్వవేది వేదవ్యాసుఁ**
**డాదిముని పరాశరాత్మజుండు**
**విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై**
**పరఁగుచుండఁజేసె భారతంబు. (1-32)**

వేదవ్యాసుడు భారతాన్ని సంస్కృతంలో రచించాడు. ఆయన పలువిధాలైన వేదతత్త్వాలు తెలిసినవాడు, మునులలో మొదటివాడు, పరాశరమునీంద్రుని పుత్రుడు. విష్ణువుతో సమానమైనవాడు. ఆ మహర్షి రచించిన భారతాన్ని ధర్మతత్త్వం తెలిసినవారు ధర్మశాస్త్ర మన్నారు. ఆత్మజ్ఞానం కలవారు వేదాంత మన్నారు. నీతిలో నిపుణులైనవారు నీతిశాస్త్ర మన్నారు. కవిశ్రేష్ఠులు మహాకావ్యమని ప్రశంసించారు. లక్షణజ్ఞానం కల్గినవారు సమస్తలక్ష్యాలయొక్క సంగ్రహరూపమని కీర్తించారు. ఇతిహాసం తెలిసినవారు ఇతిహాసమని వినుతించారు. పురాణప్రవీణులైన విబుధులు అనేక పురాణాల రాశి అని పొగడారు. ఆ రీతిగా వారు తన రచనను పలువురు ప్రశంసించునట్లుగానూ, సర్వజనులకు హితం గల్గించునట్లుగానూ వ్యాసుడు భారతాన్ని రచించాడు.



## 8

*ఆదిపర్వం చతుర్థాశ్వాసంలో శకుంతల దుష్యంతుణ్ణి ఉద్దేశించి చెప్పే పద్యమిది. దుష్యంతుడు కణ్వాశ్రమంలో గాంధర్వ పద్ధతిలో శకుంతలను చేపట్టాడు. తరువాత తన నగరానికి వెళ్ళిపోయాడు. ఆమె గర్భవతి యైనది. కణ్వు డామెను దుష్యంతుని చెంతకు పంపాడు. రాజు ఆమె ఎవరో నాకు తెలియదని అసత్యం పలికాడు. ఆ సందర్భంలో శకుంతల రాజు నుద్దేశించి చెప్పిన మాట ఇది. ఈ పద్యంలో సత్యవచనముయొక్క గొప్పతన మెట్టిదో చక్కగా వివరింపబడింది.*

**నుతజలపూరితంబులగు నూతులు నూఱిటికంటె సూనృత**
**వ్రత! యొక బావి మేలు మఱి బావులు నూఱిటికంటె నొక్క స**
**త్క్రతువది మేలు తత్క్రతుశతంబున కంటె సుతుండు మేలు త**
**త్సుత శతకంబు కంటె నొక సూనృతవాక్యము మేలు సూడఁగన్. (1-4-94)**

సత్యం పలుకుటయే వ్రతంగా గలవాడా! దుష్యంతమహారాజా! ప్రశస్తమైన నీటిచే నిండిన నూరు నూతులకంటె ఒక బావి మేలు. అలాంటి నూరు బావులకంటె ఒక మంచి క్రతువు శ్రేష్ఠం. అలాంటి నూరు క్రతువుల కంటె ఒక్క కుమారుడు మేలు. అట్టి నూరుగురు కొడుకులకంటె పరికించి చూడగా ఒక్క సత్యవచనం మేలైనది.

## 9

*ద్రుపదుడు, ద్రోణుడు బాల్యంలో సహాధ్యాయులై విద్య నభ్యసించారు. ద్రుపదుడు రాజైనాడు. ద్రోణుడు పేదవాడు గాన ధనం కోరి ఒకనాడు ద్రుపదుని వద్దకు పోయి 'నీ బాల్యమిత్రుడను, నీతో కలిసి చదువుకొన్న వాడను. నన్ను గుర్తించావా?' అని అన్నాడు. ఆ మాటలు విని సహించక ద్రుపదుడు ద్రోణుని తూలనాడుతూ చెప్పిన మాట లివి. ఐశ్వర్యగర్వం వల్ల మానవుడు నీతి దప్పి మాట్లాడతా డనడాని కిది నిదర్శనం.*

**ధనపతితో దరిద్రునకుఁ దత్త్వవిదుండగువానితోడ మూ**
**ర్ఖునకుఁ బ్రశాంతుతోడఁగడుఁ గ్రూరునకున్ రణశూరుతోడ భీ**
**రునకు వరూథితోడ నవరూథికి సజ్జనుతోడఁ గష్టదు**
**ర్జనునకు నెవ్విధంబునను సఖ్యము దా నొడఁగూడ నేర్చునే? (1-5-204)**

ఐశ్వర్యం కలవానితో దరిద్రునికీ, ఆత్మతత్త్వం తెలిసినవానితో మూర్ఖునికీ, ప్రశాంతచిత్తం గలవానితో మిక్కిలి క్రూరమైన స్వభావం కలవానికీ, యుద్ధంలో శూరుడైనవానితో భయశీలుడైన పిరికివానికీ, కవచం ధరించిన వానితో కవచం లేనివానికీ, సుజనునితో కష్టాత్ముడగు దుర్జనునికీ ఏ రీతిగా నైనా మైత్రి సంభవిస్తుందా? సంభవించ దని తాత్పర్యం.

## 10

*ఇది కూడా ద్రుపదుడు ద్రోణుణ్ణి ఉద్దేశించి చెప్పిన పద్యమే. పై పద్యానికి చెప్పిన సందర్భమే ఈ పద్యానికి గూడా అన్వయిస్తుంది.*

**సమశీల శ్రుతియుతులకు**
**సమధనవంతులకు సమసుచారిత్రులకున్,**
**దమలో సఖ్యమును వివా**
**హము నగుఁగా కగునె రెండు నసమానులకున్? (1-5-205)**

సమానమైన శీలం, చదువు గలవారికి, సమానమైన ధనం కలవారికి, సమానమగు మంచి నడవడి గలవారికి, మైత్రి గాని, వివాహం కాని తమలో సరిపడతాయి. అంతే కాని శీలం మొదలైనవాటి విషయంలో సామ్యం లేనివారికి సఖ్యం, వివాహం అనే అనేవి రెండూ సంభవిస్తాయా? సంభవించ వని భావం.

## 11

*ధర్మరాజు రాజసూయయాగం చేసినప్పుడు భీష్ముడు అతనితో గుణగరిష్ఠుడైన ఒక మహానుభావుణ్ణి పూజించుమని చెప్పాడు. అలాంటి*



*పూజనీయు డెవ్వడో చెప్పవలసిందిగా ధర్మరాజు ప్రశ్నించగా శ్రీకృష్ణుడే అన్ని విధాలా అందుకు తగినవాడని భీష్ముడన్నాడు. అంతట ధర్మరాజు శ్రీకృష్ణుణ్ణి పూజించగా శిశుపాలు డాక్షేపించి అనర్హుడైనవాణ్ణి భీష్ముని ప్రేరణతో పూజించావంటాడు. అప్పుడు ధర్మరాజు శ్రీకృష్ణుని పూజార్హతను పేర్కొంటూ చెప్పిన పద్యమిది.*

**ఆదిజుఁడైన బ్రహ్మ యుదయంబున కాస్పదమైనవాఁడు వే**
**దాది సమస్త వాఙ్మయములందుఁ బ్రశంసితుఁడైనవాఁడు లో**
**కాది త్రిలోకపూజ్యుఁడని యాత్మ నెఱింగి పితామహుండు దా**
**మోదరుఁ జెప్పెఁ బూజ్యుఁడని యుక్తమ కాకిది యేమి దోసమే! (2-2-18)**

మొదట జన్మించిన బ్రహ్మదేవుని పుట్టుకకు స్థానమైనవాడు, వేదాలు మున్నగు సకల వాఙ్మయాలలోనూ కీర్తింపబడినవాడూ, లోకాని కంతటికీ మొదటివాడూ, మూడు లోకాలలోనూ పూజింపదగినవాడూ అని బుద్ధితో గ్రహించి భీష్ముడు శ్రీకృష్ణుని పూజ్యు డని చెప్పాడు. ఇది సముచితమే. ఇందులో తప్పేమున్నది?

## 12

*భీష్ముడు చెప్పినట్లు ధర్మజుడు వాసుదేవుణ్ణి పూజించేసరికి శిశుపాలుడు అందుకు తీవ్రంగా ఆక్షేపించాడు. భీష్ముడు ధర్మరాజు చేసిన కృష్ణపూజను సమర్థించినాడు. ఇంతలో సహదేవుడు కోపావిష్టుడై సభలో తన కాలు పైకెత్తి ఇలా శిశుపాలుణ్ణి అధిక్షేపించి పలికాడు.*

**ఎడపక యర్ఘ్య మచ్యుతున కిచ్చితి మిచ్చిన దీనికిం దొడం**
**బడమని దుర్జనత్వమునఁ బల్కెడు వీరుల మస్తకంబుపై**
**నిడియెద నంచు దాఁ జరణమెత్తె సభన్ సహదేవుఁడట్టిచో**
**నుడిగి సభాసదుల్ పలుకకుండిరి తద్దయు భీతచిత్తులై. (2-2-30)**

ఈ రాజసూయయాగం ముగింపు సందర్భంలో పెద్దల సూచన ననుసరించి విడువకుండా శ్రీకృష్ణునికి అర్ఘ్య మిచ్చినాము. అలా ఇవ్వగా దీని కంగీకరించమని దౌర్జన్యంతో పలుకుతున్న వీరుల తలమీద నా కాలు మోపుతాను అంటూ ఆ సభలో సహదేవుడు తన పాద మెత్తినాడు. అప్పుడు సభలోని వారు మిక్కిలి భీతినొందినవారై ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయారు.

## 13

*పాండవులు ద్రౌపదితో గూడా అజ్ఞాతవాసకాలంలో మారు వేషాలతో విరాటుని వద్ద ఉన్నప్పుడు కీచకుడు ద్రౌపదిని చూచి కామించాడు. ఆమె ఎంత చెప్పినా వినకుండా పరస్త్రీసంగమానికి తాను సిద్ధమన్నప్పుడు ఆ నీచుణ్ణి బెదరిస్తే కానీ మెత్తబడ డని తలచి ద్రౌపది కోపాతిశయంతో అతనితో అన్న మాట లివి.*

**దుర్వారోద్యమబాహువిక్రమరసాస్తోకప్రతాపస్ఫుర**
**ద్గర్వాంధప్రతివీరనిర్మథనవిద్యాపారగుల్ మత్పతుల్**
**గీర్వాణాకృతు లేవు రిప్డు నిను దోర్లీలన్ వెసంగిట్టి గం**
**ధర్వుల్ మానముఁ బ్రాణముం గొనుట తథ్యం బెమ్మెయిన్ గీచకా! (4-2-55)**

నివారింప వీలుగాని ప్రయత్నం కల బాహువులయొక్క పరాక్రమ రసం నిండిన గొప్ప ప్రతాపంతో స్ఫురించే గర్వంతో అంధులైన శత్రువులను హతమార్చడం అనే విద్యలో నిపుణులైనవారూ, దేవతలవంటి ఆకారాలు కలవారూ అయిన నా భర్త లైదుగురు గంధర్వులు ఇప్పుడు నిన్ను భుజబలంతో అవలీలగా వెంటనే హతమార్చి నీ మానాన్నీ, ప్రాణాన్నీ హరిస్తారు. కీచకా! ఇది ఎట్లైనా నిజం సుమా!

## 14

*సంజయుణ్ణి ధృతరాష్ట్రుడు రాయబారిగా పాండవుల వద్దకు పంపాడు. కౌరవులకూ, పాండవులకూ విరోధం తప్పించాలన్న ఉద్దేశంతో అతణ్ణి పంపడ మయింది. రాయబారిగా వెళ్ళిన సంజయుడు పాండవులవద్ద ధృతరాష్ట్రుని అభిప్రాయం తెలిపి కౌరవులతో కలసిమెలసి ఉండవలసినదిగా హితముపదేశిస్తాడు. అప్పుడు శ్రీకృష్ణుడు ఆ యిరుపక్షాలూ కలిసియుండడం ఎంతైనా సముచితమన్న భావనతో చెప్పిన మాటలివి.*



**ధృతరాష్ట్రుండును బుత్రులున్ వనము గుంతీనందనుల్ సింహముల్**
**మతి నూహింప నసింహమైన వనమున్ మర్దింతు రెందున్ వనా**
**వృతవృత్తంబులు గాని సింహములకున్ వేగంబ చేటొందుఁగా**
**న తగన్‌బొందుటకార్య మీయుభయమున్ సంతుష్టిమై నున్కికిన్. (5-1-358)**

ధృతరాష్ట్ర మహారాజూ, అతని పుత్రులైన దుర్యోధనాదులూ అరణ్యం వంటివారు. కుంతీకుమారులైన పాండవులు సింహాలవంటివారు. ఆలోచించి చూడగా సింహాలు లేని అరణ్యాన్ని జనులు నశింపజేస్తారు. అట్లే అడవుల ద్వారా రక్షణ లేని సింహాలకు సైతం శీఘ్రంగా హాని కల్గుతుంది. అందువల్ల ఈ యిరుపక్షాలవారూ సంతోషంగా ఉండాలంటే వీరు సంధి చేసుకోవడం అవశ్యకర్తవ్యం.

## 15

*కౌరవులకూ, పాండవులకూ సంధి కుదర్చడానికై ధృతరాష్ట్రునిచే పంపబడిన సంజయుడు తిరిగి వచ్చి అతనికి వగపు కలిగించే కొన్ని మాటలు చెప్పి తక్కిన వివరాలు రేపు చెబుతానని వెళ్తాడు. అప్పుడు చింతాక్రాంతుడైన ధృతరాష్ట్రుడు విదురుని పిలిపించుకొని సంజయుని మాటలు ప్రస్తావించి తనకు నిద్ర పట్టడం లేదన్నప్పుడు విదురుడు చెప్పిన మాటలివి. ఈ సందర్భంలో విదురుడు చెప్పే మాటలే 'విదురనీతి' గా ప్రసిద్ధి పొందాయి.*

**బలవంతుఁడు పెనెత్తిన**
**బలహీనుఁడు ధనము గోలుపడిన యతఁడు ప్రము**

**చ్ఛిల వేచువాఁడు కామా**
**కులచిత్తుఁడు నిద్రలేక కుందుదు రధిపా! (5-2-21)**

ధృతరాష్ట్ర మహారాజా! అధికబలం కలవాడు తనపై దండెత్తి వచ్చినప్పుడు బలం చాలనివాడూ, తన వద్దనుండిన ధనం పోగొట్టుకొన్న వాడూ, దొంగతనం చేయడానికి కాచుకొనియున్నవాడూ, కామావేశంతో వ్యాకులత పొందిన మనస్సు కలవాడూ నిద్రపట్టక దుఃఖిస్తారు.

## 16

*విదురుడు ధృతరాష్ట్రుణ్ణి ఉద్దేశించి చెప్పిన నీతులలో ఇది ఒకటి. ఇట్టి నీతులు ఈ సందర్భంలో చాలా ఉన్నాయి.*

**వెలఁది జూదంబు పానంబు వేఁట పలుకు**
**ప్రల్లదంబును దండంబుఁ బరుసదనము,**
**సొమ్ము నిష్ప్రయోజనముగ వమ్ముసేత**
**యనెడు సప్తవ్యసనములఁ జనదు తగుల. (5-2-44)**

స్త్రీ సాంగత్యం, జూదం, మద్యపానం, వేట, కఠినంగా మాట్లాడడం, అతిపరుషమైన దండన విధించడం, ధనాన్ని ఏ మాత్రం ప్రయోజనం లేకుండా వ్యయం చేయడం అనేవి ఏడూ సప్తవ్యసనాలు. వీటివల్ల హాని కల్గుతుంది. కాన వాటిలో తగుల్కోరాదు.

## 17

*విదురనీతిలోనే ఇదొక నీతి. ఎదుటివ్యక్తినుండి ఒక ప్రయోజనం ఆశించినవాడు వానికి హాని కలగకుండా మృదువుగా ఆ ప్రయోజనాన్ని సాధించాలన్న విషయాన్ని సోదాహరణంగా నిరూపించిన పద్యమిది.*

**మాలకరి పుష్పములు గోయు మాడ్కిఁ దేఁటి**
**పువ్వుఁదేనియఁ గొనియెడి పోల్కి నెదురు**



**గందకుండఁగఁ గొనునది కార్యఫలము**
**బొగ్గులకుఁ బోలె మొదలంటఁ బొడువఁజనదు. (5-2-57)**

పుష్పమాలలు తయారుచేసేవాడు పువ్వులను కోసేవిధంగానూ, తుమ్మెద పుష్పంలోని తేనెను గ్రహించేరీతిగానూ, ఎదుటివాడు బాధకు గురి కాకుండా ఉండునట్లు వానినుండి కార్యముయొక్క ప్రయోజనాన్ని సాధించాలి. అంతేకాని బొగ్గులు కావాలనుకొన్నవాడు చెట్టును మొదలంటా నరికి వేసినట్లు, కార్యాన్ని సమూలంగా నశింపజేసి ఫలసాధనలో విఫలుడు కారాదు.

## 18

*పెద్దలు లేని సభ సభ కాదు. ధర్మం చెప్పని వారు ఆర్యులు కారు. సత్యదూరమైన ధర్మం ధర్మం కాజాలదు. ఏదో ఒక నెపంతో చెప్పే సత్యం సత్యం కాజాలదు అని ఈ క్రింది పద్యం వివరిస్తున్నది.*

*ధృతరాష్ట్రునితో విదురుడు చెప్పిన నీతులలో ఇది ఒకటి. సభ, ఆర్యులు, ధర్మం, సత్యం – వీటి స్వరూపం నిజంగా ఎలా ఉంటుందో ఈ నీతి చాటుతున్నది. ఆర్య లున్నదే సభ, ధర్మం చెప్పేవారే ఆర్యులు. సత్యంతో కూడినదే ధర్మం, నెపం లేని మాటయే సత్యం – అన్న అంశాలను ఇక్కడ గ్రహించాలి.*

**అది సభయే ప్రియంబెసఁగ నార్యులు నిల్వరయేని నార్యులే**
**మదిఁదలపంగ వారలు సమంచిత ధర్మము వల్కరేని, న**
**ట్టిదియును ధర్మువే తగ ఘటించిన నిక్కము లేద యేనిఁ దా**
**బదిలపు నిక్కమే యొక నెపం బిడు చొప్పగునేని భూవరా! (5-2-70)**

రాజా! పూజ్యులైన పెద్దలు ఏ సభలో ఉండరో, అది సభ యగునా? ఆలోచించగా ఆ సభలో నున్న పెద్దలు సముచితమైన ధర్మం చెప్పని పక్షంలో వారు ఆర్యులు కాగలరా? వారు చెప్పిన ధర్మం సత్యం కానిదైతే అది నిజంగా ధర్మ మవుతుందా? ఆ సత్యవచనం కూడా యథార్థాన్ని నిరూపించేది కాక ఒక నెపంతో కూడినదైతే – అది పదిలమైన సత్యం కాగలదా?

## 19

*ధర్మరాజు శ్రీకృష్ణునితో చెప్పే మాట ఇది. రాయబారిగా వచ్చిన సంజయుడు తిరిగి వెళ్ళిన తరువాత ధర్మరాజు సోదరులను, తక్కిన ఆత్మీయులను పిలిచాడు. "మనం కృష్ణుని వద్దకు వెళ్ళి ఆయనను కౌరవుల చెంతకు వెళ్ళమని చెప్పడం మంచిది. యుద్ధం తొలగి శాంతి నెలకొంటుంది" అని చెప్పాడు. ఆపై వారందరూ కలిసి శ్రీకృష్ణుని చెంతకు వెళ్ళారు. అప్పుడు ధర్మజుడు కృష్ణునితో ఇలా పలికాడు. తండ్రికి మారు తండ్రిగా పాండవులు శ్రీకృష్ణుణ్ణి భావిస్తున్నా రనడాని కిది నిదర్శనం.*

**ఆపదఁ గడవం బెట్టఁగ**
**నోపి శుభంబైనదాని నొడఁగూర్పను మా**
**కీ పుట్టువునకుఁ బాండు**
**క్ష్మాపాలుఁడు నిన్నుఁ జూపి చనియె మహాత్మా! (5-3-6)**

మహాత్ముడవైన కృష్ణా! మాకు ఆపదలు అతిక్రమించి సుఖంగా జీవించడానికీ, మంగళప్రదమైన దానిని కల్గించడానికీ, ఈ జన్మలో పాండురాజు నిన్ను జూపి తాను వెళ్ళిపోయాడు.

## 20

*సంజయ రాయబారం తరువాత శ్రీకృష్ణుణ్ణే రాయబారిగా కౌరవుల చెంతకు పంపాలని ధర్మరాజు భావిస్తాడు. కృష్ణుని వద్దకు పోయి తన అభిప్రాయం ప్రకటిస్తాడు. శత్రుత్వం లేకుండా కౌరవులతో కలిసిపోవడం మంచిదన్న తన తలపు తెలుపుతూ ఈ విధంగా అంటాడు.*

**పగ యడఁగించు టెంతయు శుభం బది లెస్స యడంగునే పగం**
**బగ వగ గొన్న మార్కొనక పల్కకయుండఁగ వచ్చునే కడుం**
**దెగ మొదలెత్తి పోవఁబగ దీర్పఁగ వచ్చిన క్రౌర్యమొందు నే**
**మిగతిం దలంచినన్ బగకు మేలిమి లేమి ధ్రువంబు కేశవా! (5-3-21)**



కృష్ణా! శత్రుత్వాన్ని నశింపజేయడం మంగళకరమైన పని. అది మేలు. శత్రుత్వం చేత శత్రుత్వం నశించదు. ఎదుటివాడు మనపై పగను పెంచుకొంటే వాణ్ణి ఎదుర్కొనకుండా, ఏమీ మాట్లాడకుండా ఉండడం తగునా? పగ పూర్తిగా తొలగేటట్లు తెగించి ఎదుటివాని మీదికి పోతే అది క్రూరత్వం అవుతుంది. అంచేత ఏ విధంగా ఆలోచించినా పగవల్ల శుభం చేకూరదు.

## 21

*కౌరవులకూ, పాండవులకూ సంధి కుదర్చడానికి, శ్రీకృష్ణుడు రాయబారిగా హస్తినకు పోవడానికి సిద్ధమయ్యాడు. అప్పుడు ద్రౌపది తన పూర్వ పరిస్థితిని స్మరించింది. ఎన్ని విధాల తన్ను కౌరవులు అవమానించారో తలపులోనికి తెచ్చుకొన్నది. ధర్మజాదులు మెత్తగ మాట్లాడడం విని పరితపించింది. ముఖంలో దీనత్వం పొడసూపగా గద్గదస్వరంతో కృష్ణునికి కౌరవులవల్ల తాను పడిన పాటులు వివరిస్తూ ఆమె చెప్పిన మాట లివి. తన పట్ల ఏమాత్రం గౌరవం లేకుండా కౌరవులు తనను ఎలా కష్టపెట్టారో ఆ తరువాతి మాటలలో వ్యక్తం చేసింది.*

**వరమునఁ బుట్టితిన్, భరతవంశముఁ జొచ్చితి, నందుఁ బాండుభూ**
**వరునకుఁ గోడలైతి, జనవంద్యులఁ బొందితి, నీతి విక్రమ**
**స్థిరులగు పుత్రులన్ బడసితిన్ సహజన్ముల ప్రాపుఁ గాంచితిన్**
**సరసిజనాభ! యిన్నిటఁ బ్రశస్తికి నెక్కినదాన నెంతయున్. (5-3-108)**

పద్మనాభా! కృష్ణా! నేను పుత్రకామేష్టి చేసిన మా తండ్రికి వరప్రభావంతో పుట్టాను. ప్రసిద్ధమైన భరతవంశానికి కోడలి నయ్యాను. జను లందరూ వినుతించే పాండవులను భర్తలుగా పొందాను. నీతిని పాటించుటలోనూ, పరాక్రమంలోనూ స్థిరత్వం కలవారని పేరుగాంచిన

కొడుకులను కన్నాను. సోదరుల ఆశ్రయం కలదాని నయ్యాను. ఇన్ని విధాలా నేను ఎంతో ప్రసిద్ధి పొందినదానను.

## 22

*కృష్ణుడు రాయబారిగా వెళ్ళినపుడు దుర్యోధనుడు తన యింట అతనికి భోజనం ఏర్పాట్లు ఘనంగా చేశానని చెప్పి ఆయనను భోజనానికి ఆహ్వానించాడు. అప్పుడు అతని యింట భుజించడం తగదని తలచిన కృష్ణుడు దుర్యోధనునితో దూతగా వచ్చినవారు ముందు భుజించడం సముచితం కాదు. నేను వచ్చిన పని నెరవేరితే భుజిస్తానంటాడు. అంతట దుర్యోధనుడు నిర్బంధంగా ఎందుకు భుజించవో చెప్పు అని అడిగినప్పుడు సమాధానంగా అతనితో వాసుదేవు డన్న మాట లివి.*

**ప్రియమెసఁగం దగం బిలిచి పెట్టెడు కూ డది లెస్సకూడు ద**
**క్కయనయహీనతం దమకు నాపదయైనెడ నిట్టునట్టు నే**
**మియు ననలేని కూడెదిరి మేవడియై చను నీవు మా దెసం**
**బ్రియుఁడవు గావు మాకు ధృతి పెంపఱ నారయ లేదొ కింతయున్. (5-3-222)**

ప్రీతిపూర్వకంగా ఒక వ్యక్తిని పిలిచిపెట్టే అన్నం తినదగిన మంచి అన్నం. అలాకాక శుభస్థితీ, నీతీ లేక అతీగతీ లేని పరిస్థితిలో తమకు కష్టం కలిగినప్పుడు ఔననీ, కాదనీ అనలేని కూడు సముచితమై ఉంటుంది. నీకు మా పట్ల ప్రీతి లేదు. పైగా ఇప్పుడు ఏమాత్రం మా ధైర్యం సడలలేదు. ఈ పరిస్థితిలో నీవు పెట్టే అన్నం తినడం సముచితం కాదని భావం.

## 23

*ఈ క్రింది పద్యం పై పద్యం చెప్పిన సందర్భం లోనిదే. అన్నం తిన్నవాడు అది అమృతమైనా పగవాడు పెట్టినాడు కాన సందేహం కల్గుతుంది. అంతేకాదు పెట్టేవాడు ప్రేమతో మంచి ఆహారమే పెట్టినప్పటికీ, ఎవరి శరీరానికైనా, ఎప్పుడైనా, ఏ కారణంతోనైనా హాని కల్గవచ్చు. కాన శత్రువు పెట్టిన ఆహారమే ఆ హానికి కారణమని జనులు భావించవచ్చు. కాన శత్రువుకు అన్నం పెట్టడం తగదని భావం.*

**పగవారి యింటఁ గుడిచిన**
**నగుఁ దమ కనుమాన మమృతమైనను దారుం**
**బగతురకుఁ కుడువఁ బెట్టగఁ**
**దగ దొడళుల కెప్పుడెవ్విధము వాటిలునో! (5-3-224)**

శత్రువుల యింటిలో అన్నం తింటే అది అమృతమే ఐనా, పెట్టినవారు పగవారు కాన తిన్నవారికి అనుమానం తప్పక కల్గుతుంది. ఆ పగవారు గూడా వీరికన్నం పెట్టడం సముచితం కాదు. ఎందుకంటే క్షణభంగురమైన ఈ శరీరాలకు ఎప్పుడు, ఏ విధమైన ఆపద సంభవిస్తుందో కదా!

## 24

*సంజయ రాయబారం విఫలమైన పిదప పాండవుల కోరిక మేరకు శ్రీకృష్ణుడు రాయబారిగా హస్తినకు వెళ్ళాడు. అక్కడ నిండుకొలువులో ధృతరాష్ట్రుడు, భీష్ముడు, ద్రోణాచార్యుడు మున్నగు పెద్దలందరూ ఉన్నారు. కృష్ణుని సందర్శించి సభాసదులందరూ అమందానందం పొందారు. అప్పుడు ధృతరాష్ట్రునితో కృష్ణుడు చెప్పిన మాట లివి. ధృతరాష్ట్రుని పెద్దరికాన్ని పేర్కొంటూ క్షీరనీరన్యాయం అనుసరించి కౌరవులూ, పాండవులూ ఐకమత్యంతో ఉండడం మంచిదని కృష్ణుని బోధ.*

**క్షీరోదకగతిఁ బాండవ**
**కౌరవు లొడఁగూడి మనికి కార్యం బది నీ**
**వారసి నడుపుము వారన**
**వీరనఁ గురుముఖ్య! నీకు వేఱుం గలదే? (5-3-258)**

కురువంశానికి ముఖ్యుడవైన ఓ ధృతరాష్ట్ర మహారాజా! పాండురాజు పుత్రులు, కురువంశానికి చెందిన దుర్యోధనుడు మున్నగువారు, పాలు నీళ్లవలె కలసిమెలసి యుండడం సముచితమైన పని. నీవు దీనిని చక్కగా పరిశీలించి నిర్వహించు. ఆ పాండుసుతులు, ఈ నీ కుమారులు – అని నీకు భేదభావం ఉన్నదా? లేదని భావం.

## 25

*రాయబారిగా కౌరవసభకు వెళ్లిన శ్రీకృష్ణభగవానుడు నిండుకొలువులో ధృతరాష్ట్రుడు మున్నగువారిని చూచి చెప్పిన మాటలివి. పాండవులు సభాసదులకు చెప్పుమన్న మాటలుగా వీటిని భగవంతుడు పేర్కొన్నాడు. ధర్మానికీ, సత్యానికీ కీడు గలిగినప్పుడు రక్షించగల శక్తి కలవారు గూడా రక్షించకూడా ఉపేక్షిస్తే, వారికే కీడు గలుగుతుందనీ, ధర్మసత్యాలను దైవం సదా కాపాడుతుందనీ ఇందలి సారాంశం.*

**సారపు ధర్మమున్ విమల సత్యముఁ బాపముచేత బొంకుచే**
**బారముఁ బొందలేక చెడఁబాటినదైన యవస్థ దక్షు లె**
**వ్వార లుపేక్ష సేసిరది వారల చేటగుఁగాని ధర్మని**
**స్తారక మయ్యు సత్యశుభదాయక మయ్యును దైవముండెడున్. (5-3-273)**

సారవంతమైన ధర్మం పాపంచేతా, నిర్మలమైన సత్యం అసత్యంచేతా కుంటివై గట్టు జేరలేక చెడిపోయిన దుఃస్థితి సంభవించవచ్చు. ఆ స్థితిలో సమర్థులై యుండికూడా ఎవరు ధర్మరక్షణకూ, సత్యపరిపాలనానికీ ప్రయత్నించకుండా ఉపేక్ష వహిస్తారో, వారికే అది కీడుగా పరిణమిస్తుంది. అంతే కాని దైవం మాత్రం ధర్మాన్ని గట్టెక్కించేదిగానూ, సత్యంచేత కలిగే శుభాలను ప్రసాదించేదిగానూ ఎప్పుడూ ఉండనే ఉంటుంది.

## 26

*రాయబారానికి వెళ్లిన కృష్ణుడు ధృతరాష్ట్రుణ్ణి చూచి చెప్పిన వాక్యాలివి. ఒకటి శాంతిమార్గం, మరొకటి సమరమార్గం. ఈ రెండు*



*మార్గాలలోనూ నడవడానికి పాండవులు సిద్ధంగానే ఉన్నారని కృష్ణుడు చెప్పాడు. ఏ మార్గాన వెళ్ళాలో నిర్ణయించవలసిన బాధ్యత ధృతరాష్ట్రునిపై మోపాడు.*

**వారలు శాంతశూరులు భవచ్చరణంబులుఁ గొల్వఁ బూనియు**
**న్నారటుఁ గాక మీకది మనంబున కప్రియమేని నింతకున్**
**బోరికి వచ్చుచుండుదురు భూవర! రెండు దెఱంగులందు నీ**
**కారయఁబథ్య మేది యగు నవ్విధ మేర్పడ నిశ్చయింపుమా! (5-3-284)**

ఆ పాండవులు శాంతచిత్తులు, మరియు శౌర్యం కలవారు, పెద్దవాడవైన నీ పాదాలను సేవించడానికి సిద్ధంగా ఉన్నారు. అలా కాక వారి సేవ లందుకోవడం నీ మనస్సుకు ఇష్టం కానిపక్షంలో యుద్ధానికి సైతం వారు సిద్ధమే. ధృతరాష్ట్ర మహారాజా! శాంతితో జీవించడం, యుద్ధం చేయడం అనే ఈ రెండు మార్గాలలో ఏ మార్గాన్ని నీవు హితంగా భావిస్తున్నావో, దానిని స్పష్టపడేటట్లు నిశ్చయించు.

## 27

*శ్రీకృష్ణుని రాయబారం గూడా విఫలమైన తరువాత కౌరవపాండవుల మధ్య యుద్ధం తప్పని సరి అయ్యే పరిస్థితి యేర్పడింది. ఉభయపక్షాలు కురుక్షేత్రంలో సమరానికి ఆయత్తమయ్యాయి. వ్యాసుడు వచ్చి ధృతరాష్ట్రునికి యుద్ధంలో విజయం దైవాధీనమని చెప్పి అంతర్ధానమయ్యాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు సంజయుణ్ణి చూచి చెప్పిన మాట లివి. వ్యాసుని అనుగ్రహంవల్ల సంజయుడు లోకపరిస్థితి అంతా తెలిసినవాడయ్యాడు. కాన అతడు భూమియొక్క స్థితిగతులను వివరిస్తాడని నమ్మి ధృతరాష్ట్రుడతణ్ణి అలా అడిగాడు.*

**భూమికిఁ గాఁగఁ బ్రాణముల పోక దలంపక రౌద్రఘోర సం**
**గ్రామము సేయుచుండుదురు రాజులు దొల్లియు నెంత దీపాకో**

**భూమి మునీంద్రసంగతి సుబుద్ధము నీకు జగంబు నాకు నీ**
**భూమి తెఱంగు సెప్పుము ప్రబోధనిరూఢముగా సమస్తమున్. (6-1-15)**

పూర్వకాలంలో కూడా రాజులు భూమికొరకై ప్రాణాలు పొయ్యేది కూడా ఆలోచించకుండా రౌద్రమై భయంకరమైన యుద్ధం చేసేవారు. ఈ భూమి ఎంత తియ్యనైనదో! మునీంద్రుడైన వ్యాసుని సాంగత్యం వల్ల నీకు ఈ జగత్తుకు సంబంధించిన విషయ మంతా తెలుసు. ఇప్పుడు ఈ భూమికి సంబంధించిన సంగతంతా గట్టిగా బోధపడేటట్లు నాకు చెప్పు.

## 28

*కురుక్షేత్రంలో కౌరవులకూ, పాండవులకూ యుద్ధం నిర్ణయమైన తరువాత ధృతరాష్ట్రుడు భూమికొరకై పోరాడే రాజులను భావించి ఆ భూమి తత్త్వ మెలాంటిదో చెప్పవలసినదిగా సంజయుణ్ణి అడుగుతాడు. అప్పుడు సంజయుడు అతనితో భూమియొక్క ఉనికినీ, అందలి దేశాలనూ, భూపాలకుల మనస్తత్త్వాన్నీ వివరించి ఈ పద్యం చెబుతాడు. ధర్మం తప్పక పాలించే రాజులకు భూమి కామధేనువువలె సకలాభీష్టాలనూ ప్రసాదిస్తుందని తాత్పర్యం.*

**వినికి గలిగి రక్షించుచు**
**ననువున దయతోడి పాడి నాయతు లెల్లం**
**గొనుచుఁ దగ నేలి పొగ డొం**
**దిన రాజున కుర్వి కామధేనువు గాదే! (6-1-41)**

రాజ్యంలో ఏమి జరుగుతున్నదో ఎప్పటికప్పుడు వింటూ తగిన విధంగా దయ గలిగిన ధర్మపద్ధతిలో రావలసిన రాబడిని తీసికొంటూ పరిపాలించి కీర్తిపొందిన భూపాలునికి ఈ భూమి కోరిన కోర్కెలు తీర్చే కామధేనువు గదా!



## 29

*కురుక్షేత్ర యుద్ధంలో కౌరవపక్షానికి నాయకత్వం వహించి భీష్ముడు పది దినాలు తీవ్రయుద్ధం చేశాడు. పెక్కుమంది శత్రువులను హతమార్చినాడు. ఆపైన శిఖండిని అడ్డం పెట్టుకొని యుద్ధం చేసిన అర్జునుని చేతి బాణాలతో దెబ్బలు దిని పడిపోయాడు. ఈ సంగతిని సంజయుడు ధృతరాష్ట్రునికి తెలియజేశాడు. అది విన్న ఆ రాజు భీష్ము డిక లేడని చింతాక్రాంతుడై చెప్పిన మాటలివి. ఇందులో కరుణరసం ఉట్టిపడుతున్నది.*

**మగఁడు లేని మగువ మాడ్కి గాకున్నె నా**
**సేన భీష్ములేమిఁ జేసి నేఁడు,**
**కురు కుమారు లెంత కుందిరో యెవ్వరే**
**మైరొ యింక నెట్టు లగుదు రొక్కొ! (6-1-62)**

ఇప్పుడు నాకు సంబంధించిన కౌరవసైన్యం భీష్ముడు లేకుండా పోవడంవల్ల భర్త లేని స్త్రీలాగా కాకుండా వుంటుందా? భీష్ము డిక లేడని విని కురుకుమారులు ఎంతగా దుఃఖించినారో, ఇంకా ఎవ్వరెవ్వరు ఏమైపోయారో! ఇకపై రానున్న దినాలలో ఏమవుతారో గదా?

## 30

*కురుక్షేత్రంలో యుద్ధం నిర్ణయ మయింది. ఉభయసేనలూ సంగరానికి ఆయత్తమై యుద్ధభూమికి చేరుకున్నాయి. అర్జునుడు తనకు సారథియగు కృష్ణుణ్ణి చూచి ఉభయసేనల మధ్య రథం నిల్పు, పోరాటానికై ఇక్కడ చేరిన వారెవరెవరో చూడాలి అన్నాడు. కృష్ణుడు అట్లే రథం నిలిపి అందరినీ చూడమన్నాడు. అర్జునుడు అక్కడ చూడగా యుద్ధానికి సిద్ధమై వచ్చిన వారందరూ తనకు సన్నిహిత బంధువులూ, గురువులూ, మిత్రులూ కావడం గమనించాడు. వారితో యుద్ధం చేసి వారిని చంపడం మంచిది కాదని తలంచి అతడప్పుడు కృష్ణునితో చెప్పిన మాట లివి. గీతలో అర్జున విషాదయోగానికి సంబంధించిన ఘట్ట మిది.*

**తాతల మామలన్ సుతులఁ దం(డులఁ దమ్ముల నన్నలన్ గురు
వ్రాతము శిష్టకోటి సఖివర్గముఁ దుచ్ఛజనానురూపదు
ర్నీతి వధించి యేఁబడయు నెత్తుటఁ దోఁగిన రాజ్యభోగముల్
ప్రీతి యొనర్చునే యశము పెల్లొదఁ గూర్చునె పెంపొనర్చునే? (6-1-183)**

కృష్ణా! యుద్ధంలో నీచు లనుసరింపదగిన దుష్టనీతితో తాతలను, మామలను, కొడుకులను, తం(డులను, తమ్ములను, అన్నలనూ, గురువులనూ, సజ్జనబృందాన్నీ, మిత్రవర్గాన్నీ చంపి దానివల్ల నేను పొందగల రక్తంతో దడిసిన రాజ్యభోగాలు నాకు ప్రీతి కల్గిస్తాయా? కీర్తిని పెంపొందిస్తాయా, ఘనతను చేకూరుస్తాయా?

## 31

*రణరంగంలో బంధువులను చంపవలసి వచ్చిందని శోకిస్తున్న అర్జునునితో శ్రీకృష్ణుడు పలికిన పలుకు లివి. ఆత్మ శాశ్వతమైనది. దానికి జననమరణాలు లేవు. శరీరం అశాశ్వతం. దాని కెలాగూ మరణం తప్పదు. కాన ఉన్నవారికైె గాని, చన్నవారికైె గాని ఆత్మజ్ఞానం కల వివేకులు దుఃఖించరు. ఇది ఆత్మ, ఇది అనాత్మ అన్న తెలివి చిత్తానికి కల్గితే - చింతలన్నీ తీరిపోతాయి. ఇది భారతంలోని గీతావచనాన్ని అనుసరించిన పద్యం.*

**వగవఁగ నేమియుం దగనివారికి నై హృదయంబు గుందగా
వగచెదు బుద్ధిమాటలను వావిరి నాడెదు నీవు పండితుల్
వగతురె యున్నవారికి నవశ్యవిధేయతఁ జన్నవారికిం
దెగు వగలెల్లఁ జిత్తము (ప్రదీప్తవివేకమయత్వ మొందినన్. (6-1-195)**

అర్జునా! ఎవరికోసమైె ఏ మాత్రం దుఃఖించవలసిన పని లేదో, వారికొరకు నీ చిత్తం శోకంచే ఆకులం కాగా దుఃఖిస్తున్నావు. పైగా నీకే అంతా తెలిసినట్లు నీవు ప్రజ్ఞావాదాలు గూడా పలుకుతున్నావు.



పండితులు అంటే ఆత్మజ్ఞానం కలవారు జీవించియున్నవారికై గాని, లేదా మరణించినవారికై గాని నీవలె దుఃఖిస్తారా? చిత్తం ఆత్మజ్ఞానంతో ప్రకాశిస్తే ఇట్టి చింతలన్నీ తీరిపోతాయి.

## 32

*గీతలోని ద్వితీయాధ్యాయంలో శ్రీకృష్ణుడు ప్రబోధించిన ఆత్మతత్త్వ మిది. బంధువులు మరణిస్తారని శోకగ్రస్తుడైన అర్జునునికి ఆత్మజ్ఞానం కల్గించడానికై భగవంతుడు ఆత్మ వినాశం లేనిదన్న తత్త్వం తెలియజేశాడు.*

**పురుషుఁడు సెడు ననువాఁడును
బురుషుఁడు సెఱుచునని పలుకు పురుషుండును న
య్యిరువురు నవివేకుల య
ప్పురుషుఁడు సెఱుపండు సెడఁడు భుజవీర్యనిధీ! (6-1-198)**

బాహుపరాక్రమానికి నెలవైన ఓ అర్జునా! ఆత్మ మరణిస్తుంది అనేవాడూ, ఒక ఆత్మ మరొక ఆత్మను చంపుతుంది అనేవాడూ -ఈ యిద్దరూ తెలివిలేనివారే. ఆత్మ మరొక ఆత్మను చంపదు, తాను చావదు సుమా!

## 33

*తాను చేసే కర్మలవల్ల కలిగే ఫలాలను పరమాత్మునికి సమర్పించా లన్నది భగవద్గీతలోని ముఖ్యమైన ఉపదేశం. అది ఈ పద్యంలో నిరూపింపబడింది.*

**ఫలముల యెడ (బ్రహ్మార్పణ
కలనపరుండగుచుఁ గార్యకర్మము నడపన్
వలయుం దత్త్వజ్ఞానము
తలకొనినం గర్మశమము దానై కలుగున్. (6-1-202)**

చేయదగిన పనులను ‘వీటి ఫలం బ్రహ్మార్పితం అగు గాక!’ అంటూ పరమాత్మకు సమర్పించి నిర్వహించాలి. అంతే గాని పనులు చేయకుండా ఉండరాదు. ఆత్మతత్త్వానికి సంబంధించిన జ్ఞానం కలిగితే కర్మ తనకు తానుగా శమించిపోతుంది. తద్వారా అన్ని బంధాలూ తొలగిపోతాయి.

## 34

*కురుక్షేత్ర సంగరంలో భీష్ముడు, ద్రోణుడు సేనానాయకులై నిర్వహించిన యుద్ధంలో చివరకు వారిరువురూ మరణించారు. ఆపైన కర్ణుడు నాయకత్వం వహించాడు. అతడు కూడా అర్జునుని పరాక్రమధాటికి కన్నుమూశాడు. ఈ వార్తను సంజయుడు ధృతరాష్ట్రునికి అందజేశాడు. అది విని ధృతరాష్ట్రుడు కర్ణుని బలాతిశయాన్ని స్తుతిస్తూ, కౌరవసేనకు కల్గిన విపత్తును పేర్కొంటూ చెప్పిన పద్యమిది.*

*కర్ణుడు కుంతీ కుమారుడు. కాని తల్లి తన్ను శైశవంలోనే పరిత్యజించింది. సూతుని కుటుంబం అతణ్ణి పెంచి పెద్దజేసింది. శ్రీకృష్ణుడు రాయబారిగా వెళ్ళినప్పు డేకాంతంలో అతని జన్మరహస్యం చెప్పి అతణ్ణి పాండవులతో చేరమంటాడు. కాని కర్ణుడు, దుర్యోధనుడు తనపై చూపిన అభిమానాన్ని స్మరించుకొని అలా రాలేనంటాడు. తుదకు తల్లి చెప్పినా అందు కంగీకరించడు. కౌరవులు కర్ణుని బలపరాక్రమాలను విశ్వసించి అతని సహకారంతో తమకు విజయం తప్పదనుకొంటారు. కాని అర్జునునిచేత కర్ణుడు మరణిస్తాడు. ఆ వార్త విని ధృతరాష్ట్రుడు పలికిన పలుకు లివి.*

**పాండుసూనులతోడి పగకోర్చి నెవ్వని**
**యుత్సాహ మూది సుయోధనుండు**
**వైదేహపౌండ్రాది వసుధేశు లెవ్వని**
**కడిమి సొంపున నరిగాఁపులైరి**



**మనమూఁక లెవ్వని పెనుఁబ్రాపు గాంచి గ**
**ర్వితములై సంగరక్రీడ సలుపు**
**నద్భుతం బొనరించు నమరుల కెవ్వని**
**యసమానవివిధదివ్యాస్త్ర మహిమ**

**యట్టి కర్ణుఁడీల్గె నట్టె యింకెక్కడి**
**బ్రదుకు మనకు నేటి భండనంబు**
**దీని వినియు నాదు మానసంబేమియుఁ**
**గాదు వజ్రమయము గాఁగ నోపు. (9-1-21)**

ఎవని ఉత్సాహాన్ని ఆధారంగా చేసుకొని దుర్యోధనుడు పాండవులతో కలిగిన శత్రుత్వాన్ని సహించుకొన్నాడో, వైదేహుడు, పౌండ్రుడు మున్నగు నరపతులు ఎవని పరాక్రమాతిశయంవల్ల కప్పం కట్టేవా రయ్యారో, మన సేనలు ఎవని ఆశ్రయం పొంది గర్వించి యుద్ధక్రీడ గావించాయో, ఎవని సాటిలేని నానావిధాలైన దివ్యాస్త్రాల ప్రభావం దేవతలకు సైతం ఆశ్చర్యం కల్గించిందో అలాంటి కర్ణుడు హతు డైనాడా? మనకు ఇంకెక్కడి బ్రదుకు? ఎక్కడి యుద్ధం? ఈ దుర్వార్త విని కూడా నా చిత్తం ఏమీ అయిపోకుండా ఉన్నట్లే ఉన్నది. ఇది వజ్రంతో నిర్మించినదై యుండవచ్చు.

## 35

*భీష్ముడు యుద్ధం ముగిసిన తరువాతగూడా అంపశయ్యపై ఉత్తరాయణసమయం వచ్చేవరకూ ప్రాణాలతో వుండినాడు. అప్పుడు ధర్మజుడు తన చెంతకు రాగా ఎన్నో ధార్మికమైన ఉపదేశాలు చేశాడు. అనుశాసనిక పర్వంలోని ఈ పద్యం అట్టి ఉపదేశవచనాలలో ఒకటి.*

**క్షేత్రంబు పురుషకారము**
**ధాత్రీశ్వర! బీజమరయ దైవము రెందున్**

**సూత్రపదఁ గూడె నేనిం**
**బాత్రమగుం గర్మకరుఁడు ఫలమున కెందున్. (13-1-134)**

రాజా! పురుషప్రయత్నం పొలం. పరిశీలించగా దైవం అందులో వేయదగిన విత్తనం. పొలమూ విత్తనం లాగానే పురుష ప్రయత్నమూ, దైవమూ – ఈ రెండూ కూడుకొంటే ఎక్కడైనా సరే కర్మ నిర్వహించేవాడు ఫలప్రాప్తికి యోగ్యుడవుతాడు.

## 36

*అంపశయ్యపై ఉన్న భీష్ముడు ధర్మరాజుకు ఎన్నో ఉపదేశాలు చేశాడు. లౌకికాలూ, అలౌకికాలూ అయిన అనేక ధర్మాలు బోధించాడు. అందులో 'అహింస' అనే ధర్మం ఇతర ధర్మాలకంటే ఉత్కృష్టమైనది అని చెబుతూ ఆ ధర్మం గొప్పతనాన్ని నిరూపించడానికి చెప్పిన మాట లివి. ఏనుగు పాదముద్ర ఇతర జంతువుల పాదముద్రలకంటె పెద్దదయినట్లే దయ అనే ధర్మం ఇతర ధర్మాలకంటె శ్రేష్ఠమైనదని తాత్పర్యం. అందుకే దయగల హృదయమే భగవన్నిలయమన్నారు.*

**దంతి యడుగులోనఁ దక్కిన జంతుచ**
**యంబు నడుగు లెల్ల నడఁగి యుండు**
**నట్ల ధర్మకోటు లన్నియు లోనగు**
**నిద్ధగుణ! యహింస కింత నిజము. (13-4-283)**

ఉత్తమగుణాలు గల ఓ రాజా! ఏనుగు నడచిపోగా దాని పాదముద్రలో మిగిలిన జంతువుల పాదముద్రలన్నీ లీనమైపోతాయి. అట్లే ధర్మాలన్నీ అహింస అనే ఉత్కృష్ట ధర్మానికి లోబడివుంటాయి. ఇది వాస్తవం.

* * *

# భాగవత పద్యాలు

## 1

*పోతన రచించిన భాగవతంలో ఇది మొదటి పద్యం. గ్రంథంలో మొదట, మధ్యలో, చివరా భగవత్ప్రార్థనా రూపమైన శ్లోకాలు, లేదా పద్యాలు వ్రాయడం కవి సంప్రదాయం. దానిననుసరించి పోతనామాత్యుడు ఇక్కడ భాగవత కథానాయకుడైన శ్రీకృష్ణపరమాత్మను తాను ధ్యానిస్తున్నట్లు చెప్పాడు. ఈ ప్రార్థన గ్రంథం నిర్విఘ్నంగా సమాప్తి కావడానికి ఉపకరిస్తుంది. శ్రీకృష్ణుడు చేసే లోకరక్షణ, భక్తపాలనం, రాక్షస నిర్మూలనం, మరియు బ్రహ్మాండాలనే భాండాలు ఆ దేవుని చూపులనుండి ఉద్భవించడం – అన్న అంశాలు ఇందులో కీర్తింపబడ్డాయి. శ్రీకృష్ణుని చరిత్రను ప్రధానంగా వర్ణించే ఈ గ్రంథంలో ఆ దేవుణ్ణి మొదట ప్రార్థించడం సముచితమే.*

**శ్రీకైవల్యపదంబుఁజేరుటకునై చింతించెదన్ లోకర**
**క్షైకారంభకు భక్తపాలనకళాసంరంభకున్ దానవో**
**ద్రేకస్తంభకుఁ గేళిలోలవిలసద్దృగ్జాల సంభూత నా**
**నాకంజాత భవాండకుంభకు మహానందాంగనాడింభకున్. (1-1)**

లోకాలనన్నింటినీ రక్షించడం ఒక్కటే ఆరంభంగా ఉన్నవాడూ, భక్తులను కాపాడడంలో వేగిరపాటు చూపువాడూ, రాక్షసుల గర్వాన్ని నిర్మూలించిన వాడూ, క్రీడలయందు ఆసక్తి గల్గి విలసిల్లే చూపులనుండి అనేకమైన బ్రహ్మాండభాండాలను సంభవింపజేసినవాడూ, గొప్పదైన యశోదకు తనయుడూ అయిన శ్రీకృష్ణపరమాత్మను మోక్షస్థానం పొందడానికై నేను ధ్యానిస్తాను.

## 2

*సాధారణంగా కవులు తమ గ్రంథాలను రాజులకు అంకితమిచ్చి వారినుండి లౌకికంగా సుఖజీవనాని కవసరమైన వస్తువాహనాదులను స్వీకరిస్తూ వుంటారు. కాని పరమభాగవతుడైన పోతనకు తన రచనను రాజులకు అంకితం చేయడం ఇష్టం లేదు. కవిత్వం భగవద్విభూతి, భాగవతం భగవంతునియొక్క, మరియు భాగవతులయొక్క చరిత్ర. దానిని భగవంతునికే సమర్పించాలి కాని ఇతరులకివ్వడం తగదని కవి అభిప్రాయం. కష్టతరమైన వ్యవసాయాదులు చేసైనా జీవించదగును గాని కవిత్వాన్ని భగవంతునికి తప్ప ఇతరుల కీరాదు అని పోతన సదాశయం. ఈ ఆశయాన్ని ఆయన ఈ పద్యంలో ప్రకటించాడు.*

**ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులున్**
**సొమ్ములుఁ గొన్ని పుచ్చుకొని చొక్కి శరీరము వాసి కాలుచే**
**సమ్మెట వ్రేటులం బడక సమ్మతితో హరికిచ్చి చెప్పె నీ**
**బమ్మెర పోతరాజొకఁడు భాగవతంబు జగద్ధితంబుగన్. (1-13)**

నేను వ్రాస్తున్న భగవచ్చరిత్ర రూపమైన యీ భాగవతాన్ని అధములైన రాజుల కివ్వడం నాకు సమ్మతం కాదు. దీనిని వారి కంకితమిస్తే వారు కొన్ని అగ్రహారాలూ, వస్తువులూ, వాహనాలూ ఇస్తారు. వాటిని పుచ్చుకొని ఈ లోకంలో సుఖంగా కాలం గడపవచ్చునేమో కాని మరణించిన తరువాత యముని సమ్మెట పోటులు తప్పవు. అట్టి రానున్న బాధలకు గురి కాకుండా ఈ బమ్మెరపోతరాజు అనే నేను లోకానికి హితం చేకూరునట్టు ఈ గ్రంథరాజాన్ని మంచి ఆలోచనతో శ్రీహరికే అంకితమిస్తున్నాను.

## 3

*చేతులతో చేసేది పూజ. నోటితో చేసేది భగవంతుని కీర్తిగానం. చిత్తంలో నిలుపవలసినది దయ, సత్యం మున్నగు గుణాలు. చేతులు శరీరానికి*



*చెందినవి. భగవంతుని కీర్తిని నుతించడం వాక్కుకు సంబంధించినది. దయాదిగుణాలు మనస్సుకు చెందినవి. శరీరం, వాక్కు, మనస్సు – అనేవి త్రికరణాలు. వీటి నన్నింటినీ పవిత్రంగా ఉంచుకోవాలి, భగవంతుని ఆరాధనకే వినియోగించాలి – అన్న పరమార్థాన్ని కవి ఈ పద్యంలో తెలిపినాడు.*

**చేతులారంగ శివునిఁ బూజింపఁడేని**
**నోరు నొవ్వంగ హరికీర్తి నుడువఁడేని**
**దయయు సత్యంబు లోనుగాఁ దలఁపఁ డేనిఁ**
**గలుగనేటికిఁ దల్లుల కడుపుచేటు. (1-14)**

ప్రతి మానవుడూ చేతులారా శివుణ్ణి పూజించాలి. నోరు నొచ్చేటట్లు శ్రీహరి కీర్తిని ప్రశంసించాలి. హృదయంలో దయ, సత్యం మున్నగు సద్గుణాలను అలవరచుకోవాలి. అలా శివపూజ చేయకున్నా, హరిని కీర్తించకున్నా, దయ, సత్యం మున్నగు గుణాలను చిత్తంలో నిలపకున్నా ఈ ప్రపంచంలో పుట్టడమెందుకు? అలా పుట్టి తల్లి కడుపును చెడగొట్టడమెందుకు? శివపూజాది సత్కార్యాలు చేయనివాడు తల్లి కడుపు చెడగొట్టడానికే పుడతాడని తాత్పర్యం.

శివుణ్ణి పూజించా లన్నాడు. హరికీర్తిని శ్లాఘించాలన్నాడు. కాన పోతనకు శివకేశవభేదం లేదు. అట్టి భేదదృష్టిని మనం కూడా విడనాడాలి.

## 4

*సంస్కృతం దేవభాష. తెనుగు మన మాతృభాష. నన్నయ మొదలు నేటివరకూ రచయితలు తెలుగు గ్రంథాలు వ్రాస్తున్నా వారు తమ రచనలలో సంస్కృతాన్ని విరివిగా వాడుతున్నారు. సంస్కృతాంధ్రాలు రెండూ విడదీయ రాని సంబంధం కలిగివున్నాయి. మహాకవులు ఈ రెండు భాషలలోనూ నిపుణులై రచనలు కావించారు. పోతన గూడా అట్టివాడే కాన అందరినీ మెప్పిస్తా నన్నాడు.*

**కొందఱకుఁ దెనుఁగు గుణమగుఁ**
**గొందఱకును సంస్కృతంబు గుణమగు, రెండుం**
**గొందఱికి గుణములగు నే**
**నందఱ మెప్పింతుఁగృతుల నయ్యై యెడలన్. (1-20)**

గ్రంథాలు రచించేవారిలోనూ, పఠించేవారిలోనూ కొంతమంది తెనుగంటే ఇష్టపడతారు. మరికొందరు సంస్కృతమైతే మా కిష్టమంటారు. ఇంకొందరు రెండు భాషలనూ ఏ మాత్రం భేదం లేకుండా మెచ్చుకొంటారు. నేను అటు తెలుగునూ, ఇటు సంస్కృతాన్నీ, లేదా ఉభయభాషలనూ ఇష్టపడే వారందరూ మెచ్చుకొనేటట్లు ఆయా సందర్భాలలో ఆ రెండు భాషలనూ ప్రయోగిస్తాను అని భావం.

## 5

*కోరిన కోర్కెల నన్నింటినీ సమకూర్చేది కల్పవృక్షం. వేదం అలాంటిది. వృక్షముయొక్క సారాంశమే ఫలమవుతుంది. అట్లే వేదానికి సారభూతమైనది భాగవతం. ఈ ఫలరసాన్ని మొదట ఆస్వాదించినవాడు శుకమహర్షి. చిలుక కొట్టిన పండు రుచి ఎక్కువగా ఉంటుందంటారు. మొదట శుకమహర్షి అనుభవించిన భాగవతఫలరసం భావుకులకూ, రసికులకూ తప్పక ఆస్వాదింపదగిందంటున్నాడు.*

**వేదకల్పవృక్షవిగళితమై శుక**
**ముఖసుధాద్రవమున మొనసియున్న**
**భాగవతపురాణ ఫలరసాస్వాదన**
**పదవి గనుడు రసికభావవిదులు. (1-37)**

వేదమనేది ఒక కల్పవృక్షం. దానినుండి బాగా పక్వమై జారిపడిన పండు భాగవతం. అష్టాదశ (18) పురాణాలలో ఇది ఒకటి. ఈ పండు శుక ముఖంలోని సుధాద్రవంతో నిండి ఉన్నది. రసికులూ, భావం తెలిసినవారూ ఈ ఫలరసం ఆస్వాదించి జన్మ ధన్యం చేసుకోండి! రండి!



## 6

*శౌనకుడు మున్నగు ఋషులు నైమిశారణ్యంలో సూతమహర్షిని చూచి చెప్పిన మాటలివి. వారికి హరికథలు వినాలనే కుతూహలం కలిగింది. ఆ కథలు వివరించడంలో ప్రవీణుడు సూతుడు. ఆ సూతుడు చెప్పిన హరి గుణాలివి.*

**భూషణములు వాణికి నఘ**
**పేషణములు మృత్యుచిత్త భీషణములు హృ**
**త్తోషణములు కల్యాణ వి**
**శేషణములు హరిగుణోపచితభాషణముల్. (1-46)**

సకలకల్యాణగుణ సంపన్నుడైన శ్రీహరియొక్క గుణములను వర్ణించే మాటలు సరస్వతికి అలంకారాలు. అవి పాపాలను పరిహరించేవి, మృత్యుదేవత చిత్తానికి భయం కలిగించేవీ, భక్తుల హృదయాలకు సంతోషం ఒడగూర్చేవీ, సకల శుభములను సమకూర్చేవిగా ఉన్నాయి.

## 7

*ఈ క్రింది పద్యం భీష్ముడు శ్రీకృష్ణుణ్ణి స్తుతించే సందర్భంలోనిది. కురుక్షేత్రయుద్ధంలో పది దినాలు భీకరయుద్ధం చేసిన భీష్ముడు చివరకు శరతల్పంపై శయనించాడు. ధర్మరాజుకు వివిధ ధర్మాలు వివరించాడు. ఇంతలో ఉత్తరాయణకాలం వచ్చింది. అది తనకు మరణకాలమని నిర్ణయించి వేరే మాటలు కట్టిపెట్టాడు. శ్రీకృష్ణుణ్ణి చిత్తంలో నిలిపి ఆర్ద్రహృదయంతో స్తుతించాడు. శ్రీకృష్ణుడు యుద్ధకాలంలో అర్జునునికి సారథియై నిత్యమూ అతణ్ణి సమీపించే దృశ్యాన్ని భీష్ము డిక్కడ వర్ణించాడు.*

**త్రిజగన్మోహన నీలకాంతి తనువుద్దీపింపఁబ్రాభాత నీ**
**రజబంధుప్రభమైన చేలము పయిన్ రంజిల్ల నీలాలక**
**వ్రజసంయుక్తముఖారవింద మతిసేవ్యంబై విజృంభింప మా**
**విజయుంజేరెడు వన్నెకాఁడు మది నావేశించు నెల్లప్పుడున్. (1-218)**

మూడు లోకాలనూ మోహింపజేసే నల్లని కాంతితో ఆ దేవుని శరీరం ప్రకాశిస్తూ వున్నది. ప్రభాతకాలంలోని సూర్యునివంటి కాంతితో శోభిల్లే వస్త్రం ఆయన ధరించివున్నాడు. నల్లని ముంగురులతో గూడిన ముద్దులొలికే ఆయన ముఖపద్మం ఇంకా చూడాలి, ఇంకా చూడాలి అనిపిస్తూ భాసిస్తున్నది. ఇలా వుంటూ మా అర్జునుణ్ణి సమీపిస్తున్న ఆ అందగాడైన కృష్ణుడు నా చిత్తంలో ఎల్లవేళలా నెలకొనుగాక!

## 8

*భీష్ముడు చేసిన శ్రీకృష్ణస్తుతిలోని చివరి పద్యమిది. శరతల్పంపై శయనించిన భీష్ముడు అవసానదశలో త్రికరణాలతోనూ భగవంతుణ్ణి స్తుతించాడు. శుద్ధ హృదయంతో ఆయన హరిని ప్రార్థించిన విషయం ఈ పద్యంలో చెప్పదమయింది. భగవంతుడు ఒక్కడైనా పలురూపాలతో భాసిస్తుంటాడన్న సత్యం ఇందులో ప్రతిపాదింపబడింది.*

**ఒక సూర్యుండు సమస్తజీవులకుఁ దా నొక్కొక్కఁడై తోఁచు పో**
**లిక నే దేవుఁడు సర్వకాలము మహాలీలన్ నిజోత్పన్న జ**
**న్య కదంబంబుల హృత్సరోరుహములన్ నానావిధానూనరూ**
**పకుఁడై యొప్పుచునుండు నట్టి హరి నేఁ బ్రార్థింతు శుద్ధుండనై. (1-226)**

సూర్యుడు ఒక్కడే. అయినా లోకంలోని సకలజీవులలో ఒక్కొక్కరికి ఒక్కొక్కడుగా కనిపిస్తున్నాడు. అట్లే పరమాత్మ ఒక్కడే అయినా సర్వకాలాలలోనూ తాను సృష్టించిన నిఖిలప్రాణుల హృదయకమలాలలో నానా రూపాలతో విలసిల్లుతున్నాడు. అలాంటి శ్రీహరిని నేను నిర్మలచిత్తుడనై ప్రార్థిస్తున్నాను.

## 9

*శ్రీకృష్ణుడు తన అవతారం చాలించి శరీరం పరిత్యజించాడు. ఈ విషయం తెలుసుకొని ద్వారకనుండి దుఃఖంతో అర్జునుడు హస్తినకు*



*వచ్చాడు. అక్కడి వార్త ఏమిటని ధర్మజుడు అడిగినప్పుడు పార్థుడు ఈ రీతిగా శ్రీకృష్ణ నిర్యాణ వార్తను చెప్పాడు. పాండవులకూ, శ్రీకృష్ణునికీ పూర్వం ఉండిన అనుబంధాన్ని తెలిపే మాట లివి.*

**మన సారథి మన సచివుఁడు**
**మన వియ్యము మన సఖుండు మన బాంధవుఁడున్**
**మన విభుఁడు గురువు దేవర**
**మనలను దిగనాడి చనియె మనుజాధీశా! (1-358)**

రాజా! మనకు సారథిగా, మంత్రిగా ఉండినవాడూ, మన వియ్యంకుడూ, మన మిత్రుడూ, మన బంధువూ, మన ప్రభువూ, మన గురువూ, మన దేవుడూ అయిన శ్రీకృష్ణుడు మనలను వదలిపెట్టి వెళ్ళిపోయాడు.

## 10

*ప్రహ్లాదచరిత్ర ఒక రమణీయమైన ఘట్టం. ప్రహ్లాదుడు రాక్షస వంశంలో పుట్టాడు. అయినా దేవతలు గూడా మెచ్చుకొనే ఉత్తమగుణాలు కల్గియుండేవాడు. నారదమహర్షి ధర్మరాజుకు ప్రహ్లాదుని స్వరూప స్వభావాలెట్టివో వివరిస్తూ ఈ క్రింది పద్యం చెప్పాడు.*

**తనయందు నఖిల భూతములందు నొకభంగి**
**సమహితత్వంబున జరగువాఁడు**
**పెద్దలఁబొడగన్న భృత్యునికైవడిఁ**
**జేరి నమస్కృతుల్ సేయువాఁడు**
**కన్నుదోయికి నవ్యకాంత లడ్డంబైన**
**మాతృభావన సేసి మరలువాఁడు**
**తల్లిదండ్రుల భంగి ధర్మవత్సలతను**
**దీనులఁగావఁజింతించువాఁడు**

**సఖులయెడ సోదరస్థితి జరుపువాఁడు**
**దైవతము లంచు గురువులఁ దలఁచువాడు**
**లీలలందును బొంకులు లేనివాఁడు**
**లలితమర్యాదుఁడైన ప్రహ్లాదుఁ డధిప! (7-115)**

రాజా! హిరణ్యకశిపునికి నల్గురు కొడుకులు. వారిలో ప్రహ్లాదుడొకడు. అతడు సమస్త ప్రాణులనూ తన్ను లాగానే సమభావంతో చూచేవాడు. అందరిపట్లా సమంగా హితభావన కల్గియుండేవాడు. పెద్దలను చూస్తే దాసునిలాగా వారివద్ద చేరి వారికి నమస్కారాలు చేస్తాడు. తన కన్నులకు ఇతరస్త్రీలు కనిపిస్తే వారిపట్ల 'వీరు నాకు తల్లులు' అని భావించి మరలిపోయే వాడు. దీనులైన జనులు కనిపిస్తే ధర్మవాత్సల్యంతో వారిని తల్లిదండ్రుల్లాగా కాపాడాలని ఆలోచించేవాడు. మిత్రులను తోబుట్టువుల్లాగా ఆదరించేవాడు. గురువులను దేవతలని భావించేవాడు. సముచితమైన మర్యాదను పాటించే ఆ ప్రహ్లాదుడు పరిహాసానికైనా అసత్యం పలికేవాడు కాదు.

## 11

*ప్రహ్లాదుని విద్యాభ్యాసస్థితిని పరీక్షింపగోరి తండ్రి హిరణ్యకశిపుడు ఆ బాలుణ్ణి ప్రశ్నిస్తాడు. అప్పుడతడు తన చిత్తం భగవంతునిపైననే ఆసక్తి గల్గియున్నదని తెలుపుతూ చెప్పిన పద్యమిది. మధురమైన పోతన రచనకు నిదర్శనమైనదీ పద్యం. ప్రహ్లాదుని నిశ్చలమైన భగవద్భక్తిని ఇందులో వర్ణించడమయింది.*

**మందారమకరందమాధుర్యమునఁ దేలు**
**మధుపంబు వోవునే మదనములకు?**
**నిర్మల మందాకినీ వీచికలఁ దూఁగు**
**రాయంచ సనునె తరంగిణులకు?**
**లలితరసాల పల్లవఖాదియై చొక్కు**
**కోయిల సేరునే కుటజములకు?**
**పూర్ణేందుచంద్రికా స్ఫురిత చకోరకం**
**బరుగునే? సాంద్రనీహారములకు?**
**నంబుజోదర దివ్యపాదారవింద**
**చింతనామృత పాన విశేష మత్త**
**చిత్తమేరీతి నితరంబుఁ జేర నేర్చు**
**వినుత గుణశీల! మాటలు వేయునేల? (7-150)**

స్తుతింపబడిన గుణాలూ, శీలమూ గల ఓ రాజా! పలుమాట లెందుకు? మందార కుసుమంలోని మకరందపు తీపిని ఆస్వాదించే తుమ్మెద ఉమ్మెత్తపూల చెంతకు పోతుందా? స్వచ్ఛమైన ఆకాశ గంగాతరంగాల మీద విహరించే రాజహంస వాగులూ, వంకలవద్దకు వెళ్తుందా? తియ్యమామిడి లేత చిగుళ్ళు భక్షించి ఆనందించే కోకిల కొండమల్లెల చెంతకు చేరుతుందా? పూర్ణచంద్రుని నిండు వెన్నెలలో కనిపించే చకోరపక్షి దట్టమైన మంచు తెరల కడకు పయనిస్తుందా? పద్మనాభుడైన శ్రీహరియొక్క దివ్యమైన పాదపద్మాల ధ్యానమనే అమృతం త్రాగి మిక్కిలిగా మత్తెక్కిన మనస్సు ఇతర పదార్థాలను ఎలా సమీపించగలదు?

## 12

*ప్రహ్లాద కుమారుని చదువు ఎంతవరకూ కొనసాగిందో తెలుసుకోవాలని హిరణ్యకశిపుడు అతని గురువుల సమక్షంలోనే అతణ్ణి అడిగిన ప్రశ్న ఇది. కేవలం పద్యం చెప్పుమనకుండా దాని అర్థతాత్పర్యాలు గూడా చెప్పుమని హిరణ్యకశిపు డడగడం గమనార్హం. అర్థం తెలియని చదువు వ్యర్థం కదా!*

**చోద్యం బయ్యెడి నింతకాల మరిగెన్, శోధించి యేమేమి సం**
**వేద్యాంశంబులు సెప్పిరో? గురువు లే వెంటంబఠింపించిరో**
**విద్యాసార మెఱుంగఁగోరెద భవద్విజ్ఞాతశాస్త్రంబులోఁ**
**బద్యం బొక్కటి సెప్పి సార్థముగ తాత్పర్యంబు భాషింపుమా. (7-163)**

నాయనా! వింతగా ఉన్నది. నిన్ను బడికి పంపి చాలాకాలం గడచింది. మీ గురువులు నీకు బాగా పరిశీలించి తెలిసికోదగిన ఏ యే విషయాలు బోధించారో, ఎలా చదివించారో కదా! నీ విద్యాబలమెట్టిదో తెలుసుకోవా లనుకొంటున్నాను. నీకు తెలిసిన శాస్త్రంలో ఒక్క పద్యం చెప్పి దానికి అర్థం, తాత్పర్యం చెప్పు.

# 13

*హిరణ్యకశిపుడు ఎంతవరకూ చదువుకొన్నావు అని అడిగిన ప్రశ్నకు ప్రహ్లాదుడిచ్చిన సమాధానమిది. చదువులలో మర్మం భగవత్తత్త్వం గ్రహించి మోక్షం పొందడమే. ప్రహ్లాదు డా విషయాన్నే తండ్రికి తెలియజేస్తున్నాడు.*

**చదివించిరి నను గురువులు**
**చదివితి ధర్మార్థముఖ్య శాస్త్రంబులు నేఁ**
**జదివినవి గలవు పెక్కులు**
**చదువులలో మర్మమెల్లఁ జదివితిఁ దండ్రీ! (7–166)**

నన్ను గురువులు చక్కగా చదివించారు. నేను వారు చెప్పినట్లు ధర్మం, అర్థం మొదలైన విషయాలు వివరించే శాస్త్రాలు చదివాను. ఒకటి, రెండు విషయాలు కాక నేను చదివినవి చాలా చాలా ఉన్నాయి. అంతే కాదు నాన్నా! నేను ఆ చదువులలో దాగిన రహస్యం గూడా! చదివాను.

# 14

*నీ విద్యాసార మెలాంటిదో నాకు వివరించు మని తండ్రి హిరణ్యకశిపుడు అడిగినప్పుడు అతని కుమారుడైన ప్రహ్లాదు డిచ్చిన సమాధానమిది. చేతులు, నాలుక, చూపులు, శిరస్సు మొదలైన అవయవాలు భగవంతుని సేవకు వినియోగపడినప్పుడే సార్థకాలు, లేకుంటే అవి నిరర్థకాలు అని ఆ బాలుడు అంటున్నాడు.*



**కమలాక్షునర్చించు కరములు కరములు**
**శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ**
**సురరక్షకునిఁ జూచు చూడ్కులు చూడ్కులు**
**శేషశాయికి మ్రొక్కు శిరము శిరము**
**విష్ణు నాకర్ణించు వీనులు వీనులు**
**మధువైరిఁ దవిలిన మనము మనము**
**భగవంతు వలగొను పదములు పదములు**
**పురుషోత్తముని మీది బుద్ధి బుద్ధి**

**దేవదేవునిఁ జింతించు దినము దినము**
**చక్రహస్తునిఁ బ్రకటించు చదువు చదువు**
**కుంభినీధవుఁ జెప్పెడి గురుఁడు గురుఁడు**
**తండ్రి! హరిఁ జేరుమనియెడి తండ్రి తండ్రి. (7–169)**

పద్మనేత్రుడైన శ్రీహరిని పూజించే హస్తాలే హస్తాలు. అలా పూజించని హస్తాలు ఉపయోగం లేనివే. శ్రీలక్ష్మీనాథుని కీర్తించే నాలుకే నిజమైన నాలుక. తక్కిన నాలుక ప్రశస్తం కాదు. దేవతలను రక్షించే శ్రీమహావిష్ణువును దర్శించే చూపులే చూపులు. తక్కినవి యథార్థమైన చూపులు కావు. ఆదిశేషునిపై శయనించే శ్రీమన్నారాయణునికి మ్రొక్కే శిరస్సే శిరస్సు. మహావిష్ణువును గూర్చి వినే చెవులే చెవులు. మధువనే రాక్షసునికి శత్రువైన శ్రీహరిని భావించే చిత్తమే యథార్థమైన చిత్తం. ఆ దేవునికి ప్రదక్షిణం చేసే పాదాలే నిజమైన పాదాలు. ఆ పరమపురుషునిపై నిలిపిన బుద్ధియే నిక్కమైన బుద్ధి. అలా కానిది మంచి బుద్ధి కాజాలదు. దేవదేవుడైన భగవంతుణ్ణి ధ్యానించే దినమే సుదినం. అలా కానిది దుర్దినమే. సుదర్శనచక్రం చేతబట్టిన శ్రీహరిని గూర్చి చెప్పే చదువే నిజమైన చదువు, భూదేవికి నాథుడైన గోవిందుని గురించి వివరించే గురువే గురువు. తండ్రీ! ఆ హరిని చేరి ఆ దేవుని అనుగ్రహం సంపాదించుమని చెప్పే తండ్రే తండ్రి. అలా కాని తండ్రి తండ్రి క్రింద లెక్కకు రాదు.

## 15

*నారదుడు ధర్మరాజుకు ప్రహ్లాద చరిత్రను వివరించే ఘట్టంలోనిది ఈ పద్యం. తన చదువును గూర్చి చెప్పక శత్రువైన విష్ణుదేవుణ్ణి కీర్తిస్తున్న ప్రహ్లాదుణ్ణి చంపవలసినదిగా రాక్షసభటులను హిరణ్యకశిపు డాజ్ఞాపించాడు. వారు శూలాలతో, ఆ బాలుణ్ణి పొడుస్తుండగా అతడు నిర్భయుడై భగవన్నామస్మరణ చేశాడు. ప్రహ్లాదుని భక్తి గొప్పతనాన్ని తెలుపుతున్న పద్య మిది.*

**తన్ను నిశాచరుల్ పొడువ దైత్యకుమారుఁడు మాటిమాటికో**
**పన్నగశాయి! యో దనుజభంజన! యో జగదీశ! యో మహా**
**పన్నశరణ్య! యో నిఖిలపావన! యంచు నుతించుగాని తాఁ**
**గన్నుల నీరు దేడు, భయకంపసమేతుఁడు గాఁడు భూవరా! (7-193)**

రాజా! రాక్షసులు హిరణ్యకశిపుని ఆజ్ఞ ననుసరించి ప్రహ్లాదుణ్ణి సంహరింప బూనుకొని శూలాలతో పొడిచారు. అలా పొడుస్తూ వుంటే ఆ బాలుడు మాటిమాటికి “ఓ శేషశాయీ! ఓ రాక్షససంహారకా! ఓ లోకప్రభూ! పెద్దగా ఆపదలలో చిక్కుకున్న వారికి రక్షకుడవైన ఓ భగవంతుడా! సకల జనులను పావనం కావించే ఓ దేవా” అంటూ స్తుతిస్తాడు. అంతే కాని కళ్ళల్లో నీళ్ళు పెట్టుకోడు. భయంతో ఏ మాత్రం వణకడు.

## 16

*హిరణ్యకశిపుడు తన్ను ధిక్కరించి తన శత్రువైన శ్రీహరిని కీర్తిస్తున్న ప్రహ్లాదుని జూచి “నేను మహాబలశాలిని. నీవు ఎవని బలంతో నన్ను తిరస్కరించి మాట్లాడుతున్నావు?” అని అడిగాడు. అప్పుడు ప్రహ్లాదుడు తండ్రితో చెప్పిన సమాధానపద్య మిది.*

**బలయుతులకు దుర్బలులకు**
**బల మెవ్వఁడు నీకు నాకు బ్రహ్మాదులకున్**
**బల మెవ్వఁడు ప్రాణులకును**
**బల మెవ్వం డట్టి విభుఁడు బల మసురేంద్రా! (7-264)**

రాక్షసరాజా! బలం కలవారికి, బలంలేని వారికి ఎవడు బలమో, రాజువైన నీకూ, బాలుడనైన నాకూ, సృష్టికర్తయైన బ్రహ్మ మున్నగువారికీ ఎవడు బలమో, లోకంలోని ప్రాణులందరికీ ఎవడు బలమైన వాడో, అట్టి లోకాధినాథుడైన శ్రీమన్నారాయణుడే నాకు బలమైయున్నాడు.

## 17

*ప్రహ్లాదుని శ్రీహరి కీర్తనం పట్ల ఆగ్రహించిన హిరణ్యకశిపుడు “నేను ఎక్కడ వెదకినా నా కతడు కనిపించలేదు. వాడెక్కడ ఉన్నాడో చెప్పరా?” అని ప్రహ్లాదుణ్ణి గద్దించి అడిగాడు. అపుడు ఆ బాలుడు చెప్పిన సమాధాన మిది.*

**ఇందుఁ గలఁ డందు లేఁడని**
**సందేహము వలదు చక్రి సర్వోపగతుం**
**డెందెందు వెదకి చూచిన**
**నందందే కలఁడు దానవాగ్రణి! వింటే! (7-275)**

రాక్షసాధీశ్వరా! చక్రధారియైన శ్రీహరి ఇక్కడ ఉన్నాడు, అక్కడ లేడు అన్న సందేహం వద్దు. ఆ దేవుడు లేనిచోటు లేదు, ఆయన ఎక్కడెక్కడ వెదకిచూచినా, అక్కడక్కడ నిండి ఉన్నాడు. ఆయన సర్వవ్యాపి, విన్నావా!

## 18

*ఇది గజేంద్రమోక్షణ కథలోని సుప్రసిద్ధమైన ప్రార్థనా పద్యం. ఇంద్రద్యుమ్ను డనే రాజును అగస్త్యుడు తన్ను సరిగా గౌరవించలేదని కోపించి ‘ఏనుగుగా పుట్టు’ అని శపించగా అతడు ఏనుగై పుట్టాడు. అట్లే ‘హూహూ’ అనే గంధర్వుడు దేవలుని శాపం వల్ల మొసలిగా జన్మించాడు. ఆ గజానికీ,*

*మొసలికీ ఒక మడుగులో కలహం సంభవించింది. మొసలిచే పట్టువడిన గజేంద్రుడు మొసలిపట్టు విడిపించుకోవడానికి తన బలం చాలక శ్రీహరిని శరణు కోరాడు. ఆ ఘట్టంలోనిది ఈ పద్యం.*

**ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై**
**యెవ్వనియందు డిందుఁ బరమేశ్వరుఁడెవ్వఁడు మూలకారణం**
**బెవ్వఁ డనాదిమధ్యలయుఁ డెవ్వఁడు సర్వము దాన యైన వా**
**డెవ్వఁడు వాని నాత్మభవు నీశ్వరునే శరణంబు వేడెదన్. (8-73)**

ఈ ప్రపంచం ఎవనివల్ల పుడుతున్నదో, ఎవనిలో లీనమై వుంటుందో, చివరికి ఎవనియందు లయమై పోతుందో, ఎవడు దేవతల కందరికీ ప్రభువైన పరమేశ్వరుడో, ఈ జగత్తుకు మూలకారణ మెవ్వడో, ఎవనికి ఆది, మధ్యం, అంతం అనేవి లేవో, ఎవడు అంతా తానై వెలుగొందుతున్నాడో, అట్టి తనకు తానుగా జన్మించే దేవుణ్ణి నేను శరణు కమ్మని ప్రార్థిస్తాను.

## 19

*గజరాజు మొసలినుండి తన్ను విడిపించుకోలేక భగవంతుణ్ణి శరణు కోరాడు. ఆయన వెంటనే తన్ను కాపాడడానికి రాకపోయే సరికి సర్వత్రా ఉండి దీనులను కాపాడేవాడు భగవంతుడని పెద్దలు చెప్పే మాటలు నిజమా? అన్న సంశయం కలిగింది. అప్పు డతడు చెప్పిన పద్య మిది.*

**కలఁడందురు దీనుల యెడఁ**
**గలఁడందురు పరమయోగిగణముల పాలం**
**గలఁడందు రన్ని దిశలనుఁ**
**గలఁడు కలం డనెడు వాఁడు కలఁడో లేఁడో! (8-86)**

రక్షణలేని దీనజనులను రక్షించడానికి భగవంతుడున్నాడని పెద్దలంటారు. అట్లే ఆ దేవుడు శ్రేష్ఠులైన యోగులవద్ద గూడా ఉంటాడంటారు. అన్ని దిక్కులలోనూ ఆ పరమేశ్వరు డున్నాడని కూడా చెబుతారు. ఇలా 'ఉన్నాడు, ఉన్నాడు' అని చెప్పబడే ఆ దేవుడు నిజానికి ఉన్నాడో! లేడో!

## 20

*మొసలిపట్టు విడిపించుకోలేక భగవంతుణ్ణి శరణు జొచ్చిన గజేంద్రుని మొర ఇది. 'నీవే తప్ప నితః పరం బెరుగ' అన్నట్లు పూర్తి విశ్వాసంతో భగవంతుణ్ణి నమ్ముకొని ప్రార్థించడమే శరణాగతి. ఈ పద్యంలో అలాంటి గజేంద్రుని శరణాగతి వర్ణించడమయింది.*

**లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యెఁ బ్రాణంబులున్**
**తావుల్దప్పెను మూర్ఛ వచ్చెఁ దనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్**
**నీవే తప్ప నితఃపరం బెఱుఁగ మన్నింపందగున్ దీనునిన్**
**రావే యీశ్వర! కావవే వరద! సంరక్షించు భద్రాత్మకా! (8-90)**

ఓ దేవుడా! నాలో ఇంక కొంచెమైనా శక్తి లేదు. ధైర్యం పట్టుదప్పి పోయింది. ప్రాణాలు గూడా నెలవులు దప్పాయి. మూర్ఛ వచ్చింది. శరీరం డస్సి పోయింది. అలసట కలిగింది. ఈ దుఃస్థితిలో నాకు నీవొక్కడవే రక్షకుడవు. నిన్ను వినా మరొకరిని నన్ను కాపాడగలవానిని నేనెరుగను. నేను దిక్కులేని దీనుడనైయున్నాను. నన్ను మన్నించు. ఈశ్వరా! రమ్ము! వరదాయకా! మంగళస్వరూపా! సంరక్షించు.

## 21

*గజేంద్రుని ప్రార్థనను వైకుంఠంలో ఉండిన విష్ణువు ఆలించాడు. ఆ దేవుని భక్తరక్షణ తత్పరత్వం ఎట్టిదో ఈ పద్యం వివరిస్తున్నది. ఈ పద్యాన్ని కొంచెం వ్రాసి ఆపై ఏమి వ్రాయాలో తోచక పోతన అలా పొలానికి వెళ్లగా ఆయన వేషంతో వచ్చిన శ్రీహరియే పూరించాడంటారు.*

**అలవైకుంఠపురంబులో నగరిలో నామూలసౌధంబుదా**
**పల మందారవనాంతరామృతసరః ప్రాంతేందుకాంతోపలో**
**త్పల పర్యంకరమావినోది యగు నాపన్నప్రసన్నుండు వి**
**హ్వలనాగేంద్రము పాహి పాహి యనఁగుయ్యాలించి సంరంభియై. (8-95)**

ఆ వైకుంఠమనే నగరంలో అంతఃపురంలోని ప్రధానమైన సౌధానికి సమీపంలోనే మందారవనం ఉన్నది. ఆ వనంలో అమృతసరస్సు ఉన్నది. ఆ మడుగు గట్టున చంద్రకాంతమణులచే నిర్మించిన ఒక వేదిక ఉన్నది. ఆ వేదికమీద కలువ పూలతో తీర్చిదిద్దిన పాన్పు ఉన్నది. ఆపదలో వున్నవారిని కాపాడే శ్రీమన్నారాయణుడు దానిమీద లక్ష్మీదేవితో గూడి వినోదిస్తూ ఉన్నాడు. భయంతో అవయవాలపై అదుపుతప్పి 'కాపాడు, కాపాడు' అని మొరపెడుతున్న ఆ గజేంద్రుని మొరను ఆ దేవుడు విన్నాడు, అతణ్ణి రక్షించడానికై త్వరపడ్డాడు.

## 22

*ఈ పద్యం భగవంతుని భక్తరక్షణ తత్పరతను చక్కగా వర్ణిస్తున్నది. పోతన రచనకు మూలం వ్యాసుడు సంస్కృతంలో రచించిన భాగవతం. అందలి గజేంద్ర మోక్షణఘట్టంలో శ్రీహరి గరుడుణ్ణి అధిష్ఠించి గజరక్షణకై బయలుదేరాడని ఉన్నది. కాని పోతన ఇక్కడ భగవద్భక్తికి గల ప్రాముఖ్యాన్ని వర్ణించడానికై ఇలా మార్చి వ్రాశాడు.*

**సిరికిం జెప్పఁడు; శంఖచక్రయుగముం జేదోయి సంధింపఁ డే**
**పరివారంబును జీరఁ డభ్రగపతిం బన్నింపఁ డాకర్ణికాం**
**తర ధమ్మిల్లముఁ జక్క నొత్తఁడు వివాదప్రోత్థిత శ్రీకుచో**
**పరి చేలాంచలమైన వీడఁడు గజప్రాణావనోత్సాహియై. (8-96)**

మొసలికి జిక్కి బాధపడుతూ తన్ను కాపాడుమని మొరపెట్టిన గజేంద్రుని ప్రాణాలను కాపాడాలన్న భావంతో శ్రీహరి ఉత్సాహం కలవాడయ్యాడు.



వెంటనే గజేంద్రుని చెంతకు బయలుదేరాడు. ఆ తొందరపాటులో ప్రక్కనే ఉన్న లక్ష్మీదేవికి తానెక్కడికి పోతున్నాడో చెప్పలేదు. శంఖాన్నీ, చక్రాన్నీ చేతబట్టలేదు. వైకుంఠ పురిలో ఉన్న తన పరివారాన్ని పిలవలేదు. తన వాహనమైన గరుడుణ్ణి ప్రయాణం కమ్మని పురమాయించలేదు. చెవిలోని తామరదుద్దు పర్యంతం జారిన జుట్టుముడిని కూడా సరిచేసుకోలేదు. ప్రణయకోపంవల్ల లేచిపోతున్న లక్ష్మీదేవియొక్క పైట చెరగును గూడా విడిచి పెట్టలేదు.

## 23

*బలిచక్రవర్తి దేవతల రాజ్యాన్ని తన చేత జిక్కించుకొన్నాడు. దేవతలు విష్ణువుతో మొరపెట్టుకోగా ఆయన అదితి గర్భంలో వామనుడై జన్మించాడు. ఆ దేవుడు బలియజ్ఞవాటికకు పోయి అతణ్ణి నిగ్రహించడానికి పూనుకొన్న ఘట్టంలో తనకు మూడడుగుల నేల చాలు అన్న వామనునితో బలిచక్రవర్తి దాతనైన తన పెంపుదలచి ఏమైనా అడుగు ఇస్తానన్నాడు. అప్పుడు మితి లేని ఆశ తగదు అంటూ వామనుడు చెప్పిన పద్యం ఇది.*

**ఆశాపాశము దాఁ గడున్ నిడుపు; లే దంతంబు రాజేంద్ర! వా**
**రాశిప్రావృత మేదినీవలయ సామ్రాజ్యంబు సేకూడియుం**
**గాసిం బొందిరి గాక వైన్య గయ భూకాంతాదులు; న్నర్థ కా**
**మాశం బాయఁగ నేర్చిరే మును నిజాశాంతంబులం జూచిరే. (8-575)**

ఆశ అనే త్రాడు చాలా చాలా పొడవైనది. రాజవర్యా! దానికి అంతం లేదు. పూర్వం వైన్యుడు, గయుడు మున్నగు రాజులు సముద్రం మేరగా గల భూవలయసామ్రాజ్యం చేతికందినా ఇంకా ఆశతో కష్టపడ్డారే కాని ధనాకాంక్షకు సంబంధించిన ఆశను, (కామాశను) వదలగలిగారా? తమ ఆశకు తుది ఏదో కనుగొన్నారా?

# 24

*వామనుడు సామాన్య బ్రహ్మచారి కాదనీ, దేవతల కార్యం సాధించడానికై కపటవేషంతో వచ్చిన విష్ణువనీ, అతనికేమీ యివ్వవద్దనీ, ఇస్తే నీ సంపదనంతా హరిస్తాడనీ రాక్షసుల కులగురువైన శుక్రుడు బలిచక్రవర్తితో చెప్పాడు. అప్పుడు శుక్రాచార్యునితో బలి చెప్పిన పద్యమిది.*

**కారే రాజులు? రాజ్యముల్ గలుగవే? గర్వోన్నతిం బొందరే?**
**వారేరీ సిరి మూట గట్టుకొని పోవం జాలిరే? భూమి పైఁ**
**బేరైనం గలదే? శిబిప్రముఖులుం బ్రీతిన్ యశఃకాములై**
**యీరే కోర్కులు? వారలన్ మఱచిరే యిక్కాలమున్ భార్గవా! (8-590)**

శుక్రాచార్యా! పూర్వకాలంలో ఎందరో రాజులు ఉండినారు కదా! వారికి రాజ్యాలు గూడా ఉండినవి కదా? వారు తమవైన ఆ రాజ్యాలను చూచుకొని గర్వించలేదా? అలా గర్వించినా, అవసాన సమయంలో అంటే మరణకాలంలో మున్ను తాము సంపాదించిన సంపాదనను మూటగట్టుకొని తమతో తీసుకు పోగలిగారా? ఇప్పుడు వారి పేరైనా ఈ లోకంలో వినిపిస్తున్నదా? శిబి మున్నగు మరికొందరు నరపాలురు ప్రీతితో కీర్తి నపేక్షించి తమ్ము ఆశ్రయించిన వారి కోర్కెలు సఫలం చేయలేదా? ఈ కాలము నందైనా వారినెవరైనా మరచిపోయారా? మరవలేదు గదా!

# 25

*బలినుండి మూడడుగుల నేల దానంగా స్వీకరించిన పిదప వామనుడు తుదకు బ్రహ్మాండమంతా నిండిపోయేంత వరకూ ఎలా ఎలా పెరిగి పెద్దవాడైనాడో ఈ పద్యంలో కనిపిస్తుంది.*

**ఇంతింతై, వటుఁడింతయై, మఱియుఁ దా నింతై, నభోవీథిపై**
**నంతై, తోయదమండలాగ్రమున కల్లంతై, ప్రభారాశిపై**
**నంతై, చంద్రుని కంతయై, ధ్రువుని పై నంతై, మహర్వాటి పై**
**నంతై,సత్యపదోన్నతుండగుచుబ్రహ్మాండాంతసంవర్ధియై.(8-622)**



వామనుడు పొట్టి బ్రహ్మచారి. మూడడుగుల నేల దానంగా అడిగి బలినుండి తీసుకొని క్రమక్రమంగా ఎదిగి చాలా పెద్దవాడైనాడు. ఇంతవాడుగా ఉన్నవాడు ఇంతా, ఇంతా పెరిగి అంతవాడైపోయాడు. ముందు మేఘ మండలం దాటాడు, ఆ పైన సూర్యచంద్రుల నతిక్రమించాడు. పిదప ధ్రువనక్షత్రం దాటాడు. ఆ పైన మహర్లోకం దాటి సత్యలోకం వరకూ పెరిగాడు. చివరికి బ్రహ్మాండమంతా నిండిపోయేంతగా ఎదిగిపోయాడు.

# 26

*కారాగారంలో దేవకికి బిడ్డగా జన్మించిన కృష్ణుడు కంసునినుండి ప్రమాదం శంకించి పుట్టిన నాటిరాత్రియందే నందగోకులంలోని నందుని యింటికి వసుదేవునిద్వారా చేర్చబడ్డాడు. ఆ బిడ్డను దేవకి బిడ్డగా కాక యశోద పుత్రుడుగానే అందరూ భావించారు. తెల్లవారేసరికి యశోద మగబిడ్డను ప్రసవించిందన్న వార్త గోకులంలో వ్యాపించింది. అప్పుడు ఒక గోపిక ఇతర గోపికల నుద్దేశించి పలికిన పద్యం ఇది.*

**ఏమి నోము ఫలమొ యింత ప్రొద్దొక వార్త**
**వింటి మబలలార! వీనులలర!**
**మన యశోద చిన్ని మగవాని గనెనట**
**చూచి వత్త మమ్మ! సుదతులార! (10-1-184)**

వనితలారా!

ఎట్టి నోముకు ఫలమో గాని ఈ దినం ప్రొద్దున్నే ఒక వార్త విన్నాము. మన యశోద చిన్న మగపిల్లవాణ్ణి కన్నదట! సుందరీమణులారా! చూచివద్దాము రండమ్మా!

# 27

*శిశువులను నిద్రపుచ్చడానికి 'జోజో!' అని జోకొట్టడం తల్లుల అలవాటు. యశోద కన్న మగపిల్లవాణ్ణి చూడడానికి గోపికలంతా వచ్చారు.*

*చూచి సంతోషించి కానుకలు ఇచ్చారు. దీవించి జోజో! అని జోకొట్టారు. వారు జోకొట్టడాన్ని పోతన ఈ కందపద్యంలో అందంగా బంధించాడు.*

**జోజో కమలదళేక్షణ!**
**జోజో మృగరాజమధ్య! జోజో కృష్ణా!**
**జోజో పల్లవకరపద!**
**జోజో పూర్ణేందువదన! జోజో యనుచున్. (10-1-190)**

పద్మం రేకులవంటి నేత్రాలు గలవాడా! కృష్ణా! జోజో! సింహం నడుమును పోలిన నడుము గలవాడా! జోజో! చివురుటాకును బోలిన కాళ్ళు, చేతులు గలవాడా! జోజో! నిండు చంద్రునిబోలిన ముఖం కలవాడా! జోజో!

## 28

*ఆకలి గొని పాలకోసమై ఏడ్చే పసిబిడ్డలను ఇలా లాలించి తియ్యని మాటలు చెప్పి చన్నుగుడిపి సంతసింపజేస్తారు. పరమాత్ముడైన శ్రీకృష్ణుడే ఇక్కడ బాలుడుగా ఈ పద్యంలో సాక్షాత్కరించాడు.*

**అలసితివి గదన్న యాకొంటివి గదన్న**
**మంచి యన్న యేడ్పు మానుమన్న**
**చన్ను గుడువుమన్న సంతసపడుమన్న**
**యనుచుఁ జన్ను గుడిపె నర్భకునకు. (10-1-259)**

అలసిపోయావు గదా నాన్నా! నీకు ఆకలి అయ్యింది గదరా బాబూ! ఎంతో మంచి అబ్బాయివిరా నీవు! ఇంక ఏడ్పు మాను. ఇదిగో నీకు పాలిస్తాను, చన్ను గుడువు. సంతోషంగా వుండరా నాన్నా! ఇలా అంటూ పిల్లవాడు ఏడవటం విని వేగంగా వచ్చిన యశోద అబ్బాయిని చేతులతో ఎత్తుకొని ఆ బాలునికి చన్ను గుడిపింది.



## 29

*నందగోకులంలో శ్రీకృష్ణుని దుడుకు పనులు నానాటికీ మితిమీరాయి. అతడు గోపికల యిళ్ళలో దూరి ఆ పాలూ, పెరుగే కాజేయసాగాడు. ఆ పాలూ, పెరుగే వారికి బ్రదుకు. అందువల్ల కృష్ణుడు చేసిన దుడుకు పనిని వారు యశోదకు చెప్పారు. ఆమె శిక్షిస్తే అతడు మంచిదారికి వస్తాడేమో అని వారి ఆలోచన.*

**ఓయమ్మ! నీ కుమారుఁడు**
**మా యిండ్లనుఁ బాలుఁ బెరుఁగు మననీఁడమ్మా!**
**పోయెద మెక్కడికైనను**
**మా యన్నల సురభులాన! మంజులవాణీ! (10-1-329)**

తియ్యనిమాటలు చెప్పే ఓ యశోదమ్మా! నీ కొడుకు సామాన్యుడు గాడు. వీడు మా యిండ్లలో పాలూ, పెరుగూ ఏ మాత్రం మిగలకుండా కాజేస్తున్నాడు. ఇంక ఈ ఊళ్లో వుండి మేమెలా బ్రతుకగలం? మా అన్నల గోవుల సాక్షిగా మేము ఎక్కడికైనా వెళ్ళిపోతాం.

## 30

*బలరాముడు మున్నగు గోపకులు ఒకనాడు యశోద వద్దకు వెళ్ళారు. అమ్మా కృష్ణుడు మట్టి దిన్నాడు అని ఆమెతో చెప్పారు. ఆమె కృష్ణుడి చేయి పట్టుకొని 'ఎందుకు మట్టి తిన్నావు?' అని అడిగింది. అందుకు బదులుగా నేర్పుకాడైన కృష్ణుడు చెప్పిన పద్య మిది.*

**అమ్మా! మన్ను దినంగ నే శిశువనో యాఁకొంటినో వెఱ్ఱినో**
**నమ్మం జూడకు వీరి మాటలు మది న్నన్నీవు గొట్టంగ వీ**
**రిమ్మార్గంబు ఘటించి చెప్పెదరు; కాదేనిన్ మదీయాస్యగం**
**ధమ్మాఘ్రాణము సేసి నావచనముల్ తప్పైన దండింపవే! (10-1-338)**

తల్లీ! మట్టి దినడానికి నేనేమి పసిపిల్లవాడినా? ఆకలిగొన్నానా? పిచ్చివాడినా? వీళ్ళు చెప్పే మాటలు నీవు నీ చిత్తంలో నమ్మవద్దు. నీ చేత నన్ను కొట్టించాలని వీళ్ళు ఈ ఉపాయం ఆలోచించి నీతో ఇలా చెబుతున్నారు. అలా కాకుంటే నా నోటివాసన చూడు. నేను చెప్పిన మాటలే తప్పు అని తేలితే నన్ను దండించు.

## 31

*శ్రీకృష్ణుడు నోరు తెరచాడు. అందులో యశోదకు సముద్రాలూ, కొండలూ, నదులూ, భూగోళాలూ మొదలైన ప్రకృతి అంతా కనిపించింది. అలా మట్టి తినలేదని నిరూపించడానికి ఆ బాలుడు తన నోట విశ్వరూపం తల్లికి చూపాడు. కళ్ళారా అది చూచిన యశోద ఆశ్చర్యచకితురాలయింది. ఆ సందర్భంలోని ఆమె చెప్పిన పద్య మిది.*

**కలయో వైష్ణవమాయయో, యితర సంకల్పార్థమో సత్యమో**
**తలపన్నేరక యున్నదాననొ యశోదాదేవి గానో పర**
**స్థలమో బాలకుఁడెంత యీతని ముఖస్థంబై యజాండంబు ప్ర**
**జ్వలమై యుండుట కేమి హేతువొ మహాశ్చర్యంబు చింతింపఁగన్. (10-1-342)**

ఏమిటిది? నేను కలగన్నానా? లేక విష్ణువు పన్నిన మాయయా? మరేదైనా సంకల్పంవల్ల కలిగిన సంఘటనా? లేక నిజమా? ఏదీ నాకు తెలియడం లేదే? నేను నిజంగా యశోదనేనా? ఇది మా యిల్లు కాక వేరే స్థలమో ఏమో? కాకపోతే ఈ పిల్లవాడంతా ఎంత? ఇతని నోట బ్రహ్మాండమంతా జాజ్వల్యమానమై కనిపించడానికి కారణమేమో? ఆలోచిస్తే ఇది పెద్ద ఆశ్చర్యంగా తోస్తున్నదే!

## 32

*నలకూబరుడు, మణిగ్రీవుడు అనే యక్షులు మద్యపానమత్తులై స్త్రీలోలురై నారదుని శాపంవల్ల భూలోకంలో మద్దిచెట్లుగా జన్మించారు. శ్రీకృష్ణుడు*



*తల్లి తన్ను కట్టిన రోలీడ్చుకుంటూ ఆ చెట్లమధ్యనుండి పోగా ఆ చెట్లు కూలిపోయాయి. దానితో వారి శాపం తొలగిపోయింది. అప్పుడు ఆ యక్షకుమారులు శ్రీకృష్ణుని వినుతిస్తూ చేసిన ప్రార్థనా పద్య మిది.*

**నీ పద్యావళు లాలకించు చెవులున్ నిన్నాడు వాక్యంబులున్**
**నీ పేరం బనిసేయు హస్తయుగముల్ నీ మూర్తిపైఁ జూపులున్**
**నీ పాదంబుల పొంత మ్రొక్కు శిరముల్ నీ సేవపైఁ జిత్తముల్**
**నీ పై బుద్ధులు మాకు నిమ్ము కరుణన్ నీరేజపత్రేక్షణా! (10-1-408)**

పద్మపత్రాల వంటి కన్నులు గల ఓ దేవా! నిన్ను కీర్తించే పద్యాలు వినే చెవులనూ, నిన్ను గురించి పలికే వాక్యాలనూ, నీకై పనిచేసే రెండు చేతులనూ మాకు ప్రసాదించు. అట్లే నీ ఆకృతిపై ప్రసరించే చూపులూ, నీ పాదాలవద్ద మ్రొక్కే శిరస్సులూ, సదా నిన్ను సేవించాలనే ఆసక్తిగల మనస్సులూ మాకనుగ్రహించు. దయతో నీ యందే ప్రసరించే బుద్ధులూ మా కిమ్ము!

## 33

*శ్రీకృష్ణుడు నందగోకులంలో ఉన్నపుడు తోడిబాలురతో కూడి ఆవులు మేపుతూ అడవికి వెళ్ళేవాడు. అలా పోయేటప్పుడు వారందరూ ఇంటినుండి చల్దులు మూటలు గట్టుకొని పోయేవారు. ఆకలి అయినపుడు అందరూ ఒకచోట వలయంగా కూర్చొని భుజించేవారు. అప్పుడు కృష్ణుడు వారి మధ్యలో కూర్చొని యుండేవాడు. అలా వారు చల్దులు భుజించే తీరును వర్ణించే ముచ్చటైన సీసపద్యం.*

**మాటిమాటికి వ్రేలు మడిచి యూరించుచు**
**నూరుఁగాయలు దినుచుండు నొక్కఁ**
**డొకని కంచములోని దొడిసి చయ్యన మ్రింగి**
**చూడు లేదని నోరు సూపు నొక్కఁ**

**దేగురార్గుర చల్దు లెలమిఁ బన్నిదమాడి**
**కూర్కొని కూర్కొని కుడుచు నొక్కఁ**
**డిన్ని యుండఁగఁ బంచి యిడుట నెచ్చెలితన**
**మంచు బంతెనగుండు లాడు నొకఁడు**

**కృష్ణుఁ జూడుమనుచుఁ గికురించి తన ౘ్రేల**
**మేలి భక్ష్యరాశి మెసవు నొకఁడు,**
**నవ్వు నొకఁడు సఖుల నవ్వించు నొక్కఁడు**
**ముచ్చటాడు నొకఁడు మరియు నొకఁడు. (10-1-496)**

చేతివ్రేళ్ళ నడుమ ఊరుగాయ ముక్కల నిరికించుకొని మాటిమాటికీ ప్రక్కనున్న బాలకుణ్ణి ఊరిస్తూ ఒకడు ఆ ఊరుగాయలు తింటున్నాడు. ప్రక్కవాని గిన్నెలోని పదార్థాన్ని గబుక్కున లాక్కొని మ్రింగివేసి వాడు చూడబోగా 'ఇదిగో చూడు, ఏమీ లేదు' అని నోరు తెరచి మరొకడు చూపిస్తున్నాడు. ఇంకొకడు పందెం వేసికొని ఐదారుగురి చల్దిని తన ఒక్కని నోటనే కూరుకొని కూరుకొని తింటున్నాడు. మరొకడు కంచంలో ఇన్ని ఆహారపదార్థా లుండగా వీటిని పంచి మిత్రుల కివ్వడం మిత్రలక్షణ మంటూ ఇతరుల కంచంలోనిది తీసుకొంటూ, 'బంతెన గుండ్లాట' ఆడుతున్నాడు. వేరొకడు 'ఇదుగో, కృష్ణుని చూడు' అని చెప్పి వాడు అలా చూడగా వాణ్ణి మోసగించి వాడి కంచంలోని మేలైన పదార్థాలను తింటున్నాడు. ఒకడు తాను నవ్వుతాడు. మరొకడు ఇతరులను నవ్విస్తాడు. వేరొకడు ముచ్చటలు చెబుతాడు. ఇంకొకడు ప్రక్కవారి మాటలు వింటూ మురిసిపోతున్నాడు.

## 34

*ఈ భూలోకంలో ధర్మరక్షణకై అవతరించి బాల్యంలోనే ఊహకందని లీలలను ప్రదర్శిస్తున్న శ్రీకృష్ణుణ్ణి గూర్చి విని బ్రహ్మ ఆ దేవదేవుడెట్టివాడో చూడాలని వచ్చాడు. తన సృష్టికి ప్రతిసృష్టి చేసి చూపిన కృష్ణుని మహిమను*



*గుర్తించాడు. తనకంటే కృష్ణుణ్ణి సదా సేవిస్తున్న ఆ గోపబాలురే గొప్పవారని గ్రహించి ఇలా కృష్ణుని మహిమను శ్లాఘించాడు.*

**ఏలా బ్రహ్మపదంబు వేదములకున్ వీక్షింపఁగారాని ని**
**న్నీలోకంబున నీ వనాంతరము నందీ మందలోఁ గృష్ణ! యం**
**చాలాపాదిసమస్తభావములు నీయందే సమర్పించు నీ**
**వ్రేలం దొక్కని పాదరేణువులు పై వేష్టించినన్ జాలదే! (10-1-572)**

వేదాలు గూడా నీ స్వరూపాన్ని చూడజాలవు. అలాంటి నిన్ను ఈ లోకంలో, ఈ అడవిలో, ఈ మందలో 'కృష్ణా, కృష్ణా' అంటూ మాటలు, పాటలు అన్ని భావాలూ నీయందే సమర్పించుకొని ఈ బాలకులు నిన్నే సర్వస్వంగా భావించుకొంటున్నారు. అలాంటి ఈ గోపబాలకులలో ఒక్కని పాదపరాగం పైన పడితే చాలదా? ఇక నా కీ బ్రహ్మపదవి ఎందుకు?

## 35

*గోపికల మనస్సులను దోచుకొన్న శ్రీకృష్ణుడు వారితో కలిసి విహరించేవాడు. ఒక శరద్రాత్రినాడు వేణుగానం కావించిన అతని చెంతకు గోపికలు వచ్చారు. అతనితో క్రీడించారు. ఇంతలో ఒక్కసారిగా అతడు అంతర్ధానమై పోయాడు. వారతని కోసం వెదుకసాగారు. అలా వెతుకుతూ ఒక మల్లెపొద వద్దకు వెళ్ళి ఇలా ప్రశ్నించారు. శ్రీకృష్ణుని అందచందాలనూ, వైభవాన్నీ మనోహరంగా వర్ణించిన పద్యమిది.*

**నల్లనివాడు పద్మనయనంబులవాఁడు కృపారసంబుపై**
**జల్లెడువాఁడు మౌళిపరిసర్పిత పింఛమువాఁడు నవ్వు రా**
**జిల్లెడు మోమువాఁడొకఁడు చెల్వల మానధనంబుఁదెచ్చె నో**
**మల్లియలార! మీ పొదలమాటున లేడు గదమ్మ! చెప్పరే. (10-1-1010)**

నల్లని శరీరవర్ణం కలవాడు, పద్మాలవంటి నేత్రాలు గలవాడు, అందరిమీదా కృపారసం చల్లేవాడూ, సిగపై వ్యాపించిన నెమలిపింఛం

కలవాడూ, సదా ముఖంపై చిరునవ్వు విరాజిల్లేవాడూ అయిన ఒక అందగాడు మానవతుల మానధనం దోచుకొని తెచ్చినాడు. ఓ మల్లెలారా! అతడు మీ పొదల వెనుకలేడు గదా! చెప్పండి!

## 36

*కంసుని పిలుపందుకొని బలరామకృష్ణులు మధురానగరం వెళ్ళారు. అప్పుడు అక్కడ సుదాముడు అనే ఒక మాలాకారుడు సువాసన గల పూమాలలు తెచ్చి యిచ్చాడు. వారు అతడిచ్చిన మాలలు గైకొని అలంకరించుకొన్నారు. ఆపై నీ కేమి వరం కావాలో కోరుకొమ్మనగా అతడు కోరుకొన్న వరమిది. అందరూ కంఠస్థం చేసుకోదగిన పద్యమిది.*

**నీ పాదకమలసేవయు**
**నీ పాదార్చకుల తోడి నెయ్యమును నితాం**
**తాపారభూతదయయును**
**తాపసమందార! నాకు దయసేయగదే! (10-1-1268)**

దేవా! తాపసులకు కల్పవృక్షం వంటివాడా! నీ పాదపద్మాలసేవనూ, నీ పాదాలను పూజించేవారితో మైత్రినీ, సకల జీవరాశిమీదా అత్యంతం అపరిమితమైన దయనూ నాకు ప్రసాదించుమా!

## 37

*విదర్భ రాజపుత్రి అయిన రుక్మిణి శ్రీకృష్ణుణ్ణి ప్రేమించింది. తన ప్రేమసందేశాన్ని ఒక బ్రాహ్మణునిద్వారా శ్రీకృష్ణునికి పంపింది. అతడు ద్వారకానగరానికి పోయి శ్రీకృష్ణుణ్ణి చూచి రుక్మిణి యిచ్చిన సందేశాన్ని ఆ దేవునికి వినిపిస్తాడు. ఆ సందేశమే ఇది. లక్ష్మీస్వరూపిణి అయిన రుక్మిణి శ్రీకృష్ణుణ్ణి ఎంతగా ప్రేమించిందో ఈ పద్యం చదవండి.*



**ఏ నీ గుణములు కర్ణేంద్రియంబులు సోక**
**దేహతాపంబులు దీఱిపోవు**
**నేనీ శుభకార మీక్షింప కన్నుల**
**కఖిలార్థలాభంబు గలుగుచుండు**
**నేనీ చరణసేవ లే ప్రొద్దు జేసిన**
**భువనోన్నతత్వంబుఁబొందఁగలుగు**
**నేనీ లసన్నామ మేప్రొద్దు భక్తితోఁ**
**దడవిన బంధసంతతులు వాయు**

**నట్టి నీయందు నాచిత్త మనవరతము**
**నచ్చియున్నది నీ యాన నాన లేదు**
**కరుణఁ జూడుము కంసారి! ఖలవిదారి!**
**శ్రీయుతాకార! మానినీచిత్తచోర! (10-1-1702)**

కంస వినాశకా! దుర్జనులను సంహరించువాడా! లక్ష్మీసంపన్నమైన ఆకారం కలవాడా! మానవతుల చిత్తములను దొంగలించినవాడా! శ్రీకృష్ణా! ప్రశస్తమైన నీ కల్యాణగుణాలు వింటే శరీరంలోని తాపాలన్నీ శమిస్తాయి. మంగళకరమైన నీ ఆకారాన్ని చూస్తే కళ్ళకు సమస్త ప్రయోజనాలూ సిద్ధిస్తాయి. సదా నీ పాదసేవలు చేస్తే ప్రపంచంలో సమున్నత స్థితిని పొందవచ్చు, నీ దివ్యనామాన్ని సర్వవేళలా భక్తితో స్మరిస్తే బంధాలన్నీ పటాపంచలవుతాయి. అట్టివాడవైన నీయందు నా మనస్సు సంలగ్నమైయున్నది. అందు కది సిగ్గు పడడం లేదు. ఇది ముమ్మాటికీ సత్యం. నన్ను కృపతో కటాక్షించు.

## 38

*ఈ పద్యం రుక్మిణీ కళ్యాణఘట్టంలోనిది. శ్రీకృష్ణుని ప్రేమించిన రుక్మిణి తన కా దేవుణ్ణే భర్తగా అనుగ్రహించుమని యిందులో ప్రార్థిస్తున్నది. తన్ను*

*తన సోదరుడు నిర్ణయించినట్లు శిశుపాలునికిచ్చి పెండ్లి చేస్తారేమో అన్న సంశయం ఆమెకున్నది. అందుచే గుడికి వెళ్ళినపుడు పార్వతీదేవి నిలా ప్రార్థించింది.*

**నమ్మితి నా మనంబున సనాతనులైన యుమామహేశులన్**
**మిమ్ము!c బురాణ దంపతుల మేలు భజింతుగదమ్మ! మేటి పె**
**ద్దమ్మ! దయాంబురాశివి గదమ్మ! హరిం బతిcజేయుమమ్మ! ని**
**న్నమ్మినవారి కెన్నటికి నాశము లేదు గదమ్మ! యీశ్వరీ! (10-1-1742)**

ఓ పార్వతీ! శాశ్వతులైన పార్వతీపరమేశ్వరులగు మిమ్ము నా మనస్సులో దృఢంగా నమ్మినాను. మీరు ఆదిదంపతులు. భక్తితో మిమ్ము సేవిస్తున్నాను. నీవు అమ్మలందరిలో మేటివైన పెద్దమ్మవు. దయకు సముద్రం వంటిదానవు. నాకు శ్రీకృష్ణుని భర్తగా ప్రసాదించుమమ్మా! నిన్ను నమ్మినవారి కెవరికీ ఎప్పటికీ నాశం లేదు గదా తల్లీ!

## 39

*ఇది కుచేలోపాఖ్యానంలోని పద్యం. బాల్యమిత్రుడైన కృష్ణుణ్ణి చూడడానికి తన భార్య ప్రేరణతో నిరుపేద కుచేలుడు ద్వారకకు వెళ్ళాడు. అక్కడ ఆయన చూచిన కృష్ణు డెలాంటివాడో ఈ పద్యం వర్ణిస్తున్నది. ఇందలి శబ్దాలంకార సౌందర్యం గమనించదగి వున్నది.*

**ఇందీవరశ్యాము వందితసుత్రాముc**
**గరుణాలవాలు భాసురకపోలుc**
**గౌస్తుభాలంకారుc గామిత మందారు**
**సురుచిరలావణ్యు సురశరణ్యు**
**హర్యక్షనిభమధ్యు నఖిలలోకారాధ్యు**
**ఘనచక్రహస్తు జగత్ప్రశస్తు**
**ఖగకులాధిపయానుc గౌశేయపరిధానుc**
**బన్నగశయను నబ్జాతనయను**



**మకర కుండల సద్భూషు మంజుభాషు**
**నిరుపమాకారు దుగ్ధసాగరవిహారు,**
**భూరిగుణసాంద్రు యదుకులాంభోధిచంద్రు**
**విష్ణు రోచిష్ణు జిష్ణు సహిష్ణుc గృష్ణు. (10-2-979)**

నల్ల కలువలవంటి శ్యామల వర్ణం కలవాడూ, దేవేంద్రునిచేత స్తుతింపబడినవాడూ, కృపకు నెలవైనవాడూ, ప్రకాశించే చెక్కిళ్ళు కలవాడూ, కౌస్తుభమణిని అలంకారంగా దాల్చినవాడూ, యాచకులకు కల్పతరువు వంటివాడూ, కాంతిమంతమగు సౌందర్యం కలవాడూ, దేవతలకు రక్షకుడైనవాడూ, సింహంవంటి నడుము గలవాడూ, సమస్త లోకాలచేత పూజింపదగినవాడూ, ఘనమైన సుదర్శనచక్రమును చేతబట్టినవాడూ, ప్రపంచంలో పేరెన్నిక గన్నవాడూ, పక్షులకు ప్రభువైన గరుడుని వాహనంగా కలవాడూ, పీతాంబరం ధరించినవాడూ, శేషునిపై శయనించువాడూ, పద్మంవంటి నేత్రాలు కలవాడూ, మకరకుండలాలు మంచిభూషణాలుగా కలవాడూ, మధురంగా మాట్లాడువాడూ, సాటిలేని సుందరాకారం కలవాడూ, క్షీరసాగరంలో విహరించువాడూ, గొప్పగుణాలు గలవాడూ, యదువంశమనే సముద్రానికి చంద్రుడూ, కాంతిమంతుడూ, జయశీలుడూ, సహనపరుడూ, సర్వత్రా వ్యాపించినవాడూ అయిన కృష్ణుణ్ణి కుచేలుడు చూచాడు.

## 40

*పరీక్షిత్తు శృంగి శాపంవల్ల ఏడు దినాలలో మరణించవలసిన దుఃస్థితి పొందాడు. ఆ సమయంలో ముక్తికి పోయే మార్గం అన్వేషిస్తుండగా శుకమహర్షి వచ్చాడు. ఆ యోగి ఆయనకు భాగవతాన్ని ఏడు దినాల్లో బోధించాడు. భాగవత ప్రవచనం పూర్తి అయిన సమయంలో శుకుడు పరీక్షిత్తుకు చెప్పిన మాటలివి. శ్రీహరి ధ్యానంతో పునర్జన్మ కలగదనీ, విష్ణులోక నివాస సౌఖ్యం కల్గుతుందనీ ఈ పద్యం స్పష్టం చేస్తుంది.*

**ఏను మృతుండ నౌదునని యింత భయంబు మనంబు లోపలన్**
**మానుము సంభవంబు గల మానవకోట్లకుఁ జావు నిత్యమౌ**
**గాన హరిం దలంపు మిఁక గల్గదు జన్మము నీకు ధాత్రిపై**
**మానవనాథ! పొందెదవు మాధవలోకనివాస సౌఖ్యముల్. (12-25)**

'నేను చనిపోతాను' అనే భయం మనస్సునుండి వదలిపెట్టు. పుట్టిన మానవ సమూహాలకు గిట్టడం గూడా నిత్యధర్మంగా వున్నది. అందువల్ల శ్రీవిష్ణుమూర్తిని చిత్తంలో భావించు. ఇక మీదట నీకు భువిలో జన్మము ఉండదు. రాజా! నీవు విష్ణులోకంలో నివాసం పొంది అందలి సుఖాలు తప్పక పొందుతావు.

* * *

# రామాయణ పద్యాలు

## 1

*సరయూనదీతీరంలో కోసలదేశం ఉండేది. ఆ దేశానికి ముఖ్యపట్టణం అయోధ్య. దానిని రాజధానిగా చేసుకొని దేశాన్ని పాలించినవాడు సూర్యవంశస్థుడైన దశరథమహారాజు. ఆతని గుణగణాలను వర్ణించే పద్యమిది. ఈ పద్యాలు భాస్కర రామాయణమునుండి గ్రహింపబడినవి.*

*ఆ రాజు వద్ద 1) విజయుడు, 2) ధృష్టి, 3) మంత్రపాలుడు, 4) సిద్ధార్థుడు, 5) రాష్ట్రసాధకుడు, 6) అశోకుడు, 7) జయంతుడు, 8) సుమంత్రుడు – అనే ఎనిమిది మంది మంత్రు లుండేవారు. వారే ఈ పద్యంలో 'అష్టమంత్రి' అనే పదం చేత పేర్కొనబడినారు.*

*ఇక నవ నిధులనగా 1) మహాపద్మం, 2) పద్మం, 3) శంఖం, 4) మకరం, 5) కచ్ఛపం, 6) ముకుందం, 7) కుందం, 8) నీలం, 9) ఖర్వం – అనేవి. ఇవి కుబేరుని నవనిధులుగా ప్రఖ్యాతిపొందాయి. దశరథుని చెంత గూడా ఇవి ఉండేవని కవి వర్ణించాడు. శ్రీరాముని తండ్రి దశరథుడు కాన రామాయణప్రారంభంలో ఆ రాజును వర్ణించడ మయింది.*

**జనలోకైకమహారథుండు ద్విజరక్షాదక్షుఁ డాజిం ద్రిలో**
**చనుఁ డుద్యచ్చతురంగసైన్యుఁడును భాస్వద్రూపపంచాస్త్రుఁ డ**
**న్యనృపక్రౌంచషడాననుండు ఘనసప్తాశ్వాన్వయుం డష్టమం**
**త్రినవద్రవ్యనిధీశుఁడై దశరథాధీశుండు పెంపొందుచున్. (1-37)**

ప్రజాజగత్తులో తిరుగులేని ముఖ్య మహారథుడూ, విప్రులను కాపాడడంలో సమర్థుడూ, యుద్ధంలో ముక్కంటిని పోలినవాడూ, విజృంభించే రథాలూ, గజాలూ, గుర్రాలూ, కాల్బలమూ అనే నాలుగంగాలు గల సైన్యం కలవాడూ, ప్రకాశించే సౌందర్యంలో మన్మథునివంటివాడూ,

పరరాజు లనే క్రౌంచపర్వతాన్ని భేదించడంలో ఆరు ముఖాలు గల కుమారస్వామిని పోలినవాడూ, గొప్ప సూర్యవంశంలో ఉద్భవించినవాడూ, ఎనిమిదిమంది మంత్రులకూ, తొమ్మిది నిధులకూ అధిపతియైనవాడూ అగు దశరథు డనే రాజు అన్ని విధాలా అతిశయించినవాడై (అయోధ్యానగరాన్ని పరిపాలించాడు).

## 2

*దశరథమహారాజు పుత్రకామేష్టియాగం చేసినప్పుడు ఆ హోమాగ్ని నుండి ఒక పురుషుడు ఉదయించాడు. అతడు స్వర్ణపాత్రలో పుత్రోత్పత్తి కారణమైన పాయసం తెచ్చి రాజు కిచ్చాడు. రాజు తన ముగ్గురు భార్యలకు ఆ పాయసం పంచి యిచ్చాడు.*

*ఆ పాయసం సేవించిన కౌసల్యకు శ్రీరాముడు విష్ణుదేవునిలో సగం అంశంతో జన్మించాడు. ఎలాంటి శుభలగ్నంలో ఆయన పుట్టాడో ఈ క్రింది పద్యం వివరిస్తున్నది. చైత్రశుద్ధ నవమిని ఇప్పటికీ మనం శ్రీరామనవమిగా, ఒక పండుగ దినంగా జరుపుకొంటాము. భరతలక్ష్మణశత్రుఘ్నులు గూడా విష్ణువుయొక్క తక్కిన సగంలోని అంశాలతో జన్మించారు. ధర్మరక్షణకై అవతరించిన శ్రీరామచంద్రుణ్ణి విష్ణువుయొక్క పూర్ణావతారంగా పురాణాలు వర్ణించాయి.*

**వెలయఁ బండ్రెండవ నెలయందుఁ జైత్రపు**
**నర్వసు బుధశుద్ధ నవమినాడు**
**పంచగ్రహంబులు పరఁగ నుచ్చస్థాన**
**గతులుగా గురుసుధాకరులు గూడఁ**
**గర్కటకాఖ్యలగ్నమునందుఁ గౌసల్య**
**హరికర్ధమగు రాము నమరఁ గనియె**
**గురువారమునఁ జారుతర మీనలగ్నంబు**
**ననుఁ బుణ్యదశమి దినమునఁ గైక**



**పద్మనాభు నంశంబున భరతునిఁ గనియె**
**గర్కటకలగ్న మాశ్లేషకావ్యవార**
**మమర నేకాదశిని విష్ణు నంశమున సు**
**మిత్ర లక్ష్మణు శత్రుఘ్ను మెఱయఁగనియె. (1-156)**

తరువాత పండ్రెండవ నెలయందు చైత్రమాసం పునర్వసు నక్షత్రాన బుధవారం శుక్లపక్ష నవమినాడు ఐదుగ్రహాలు ఉన్నతస్థితిలో ఉండగా, గురువూ, చంద్రుడూ కూడియున్న వేళ కర్కటక లగ్నంలో కౌసల్యాదేవి మహావిష్ణువులో సగమైన శ్రీరాముణ్ణి ప్రసవించింది. గురువారంనాడు ఇంపైన మీనలగ్నంలో పవిత్రదశమి తిథినాడు కైక శ్రీహరి అంశమైన భరతుణ్ణి కన్నది. కర్కటక లగ్నంలో ఆశ్లేష నక్షత్రం శుక్రవారాన ఏకాదశినాడు సుమిత్ర విష్ణుదేవుని అంశంతో వెలుగొందే లక్ష్మణుణ్ణీ, శత్రుఘ్నుణ్ణీ కన్నది.

## 3

*విశ్వామిత్రుడు రాజైయుండికూడా తపఃప్రభావంతో బ్రహ్మర్షిగా భాసించిన మహనీయుడు. ఆయనకు గల విశిష్ట లక్షణాలు ఈ క్రింది పద్యంలో నిరూపించబడ్డాయి. రాముణ్ణి తన యాగసంరక్షణకు పంపమని రాజును అడగడానికి ఆయన వచ్చాడని తరువాతి కథ ద్వారా తెలుస్తుంది.*

**ధరణీశుం గన గాధిపుత్రుఁడు సముద్యత్పుణ్యగాత్రుండు, భా**
**సురచారిత్రుడు సర్వసంయమిజనస్తోత్రైకపాత్రుండు, సు**
**స్థిరసంపూర్ణతపఃపవిత్రుఁ దురుసందీప్తప్రభామిత్రుఁ డ**
**ధ్వరసంపూజితవీతిహోత్రుఁడగువిశ్వామిత్రుఁడేతెంచినన్. (1-165)**

అయోధ్యానగరానికి అధిపతియైన దశరథమహారాజును చూడడానికి ఒకనాడు విశ్వామిత్రుడనే మహర్షి వచ్చాడు. ఆయన 'గాధి' అనే మహనీయుని కుమారుడు, చక్కగా విరాజిల్లే పవిత్రమైన శరీరం కలవాడు,

ప్రకాశమానమైన నడవడిక గలవాడు, సకల మునిజనుల స్తోత్రాలకూ ముఖ్యంగా అర్హుడైనవాడు, శాశ్వతమైన సమగ్రతపస్సుచేత పవిత్రుడైనవాడు, గొప్పగా దీపించే ప్రకాశం కల సూర్యునివంటివాడు, యాగాలలో అగ్నిని పూజించినవాడు, అలాంటి మహానుభావుడు దశరథుణ్ణి చూడడానికి వచ్చేశాడు.

## 4

*విశ్వామిత్రుడు దశరథుణ్ణి చూడడానికి వచ్చి ఆయన చేసిన సత్కారాలు అందుకొన్నాడు. ఆపై మీరేమడిగినా ఇస్తా నన్నాడు. అందుకు సంతోషించిన విశ్వామిత్రుడు తన యజ్ఞాన్ని పాడుచేస్తున్న ఇద్దరు రాక్షసులను సంహరించడానికి నీ రాముడు సమర్థుడు, అతణ్ణి తనతో పంపవలసినదని అర్థించాడు. అందుకు దశరథుడు బాలుడైన రాముణ్ణి క్రూరరాక్షసులతో యుద్ధానికి పంపడం ఇష్టం లేక రాముని పంపజాలను అని చెబుతాడు. విశ్వామిత్రు డిది విని కోపోద్దీపితు డవుతాడు. అపుడు వసిష్ఠుడు రాజుతో విశ్వామిత్రరక్షణలో రాముని కేమీ ప్రమాదం వాటిల్లదంటూ క్రింది పద్యం చెప్పాడు.*

**అనలముచేత గుప్తమగు నయ్యమృతంబును బోలె నీతపో**
**ధన పరిరక్షితుం డగుచుఁదద్దయు నొప్పెడు నీతనూభవుం**
**డని నకృతాస్త్రుఁడైనను, నిరాయుధుఁడైన, నిశాటకోటికిన్**
**జెనకఁగరాదు కౌశికుఁడు చెప్పఁగఁ గేవల సంయమీంద్రుడే. (1-204)**

అగ్నిచేత రక్షింపబడిన అమృతంలాగా ఈ తపస్వియగు విశ్వామిత్రుని చేత రక్షింపబడుతూ ఎంతగానో విలసిల్లే నీ కుమారుడు రాముడు యుద్ధంలో అస్త్రవిద్యా నిపుణుడు కాకుండినప్పటికీ, ఆయుధాలు లేనివాడైనా, ఇతణ్ణి రాక్షసులు ఎదుర్కోలేరు. ఈ విశ్వామిత్రుడు సామాన్యమునీంద్రుడా యేమి?



## 5

*శ్రీరామలక్ష్మణులు విశ్వామిత్ర యాగసంరక్షణం చేసి జనకుని రాజధానియైన మిథిలకు ఆ మునితో గూడా వెళ్ళారు. మార్గమధ్యంలో కనిపించే విశేషాలను ఆ మునీంద్రుడు వారికి వివరిస్తూ వెళ్ళాడు. కుశనాభు డనే రాజర్షి వృత్తాంతం వినిపిస్తూ ఇలా అన్నాడు. కుశనాభుడు ఘృతాచివలన నూరుమంది కుమార్తెలను కన్నాడు. మహాసౌందర్యవతులైన వారిని ఆరామంలో చూచి వాయుదేవుడు తన్ను వరించవలసినదిగా అర్థించాడు. తండ్రి అనుమతి లేకుండా అలా చేయడం ధర్మం కాదని వారు బదులు పలికారు. వాయువు కోపించి వారి శరీరాలను కుబ్జరూపాలు గలవిగా చేశాడు. వారు ఇంటికిపోయి జరిగిన సంగతి తండ్రికి తెలుపగా అతడు వాయుదేవుని దౌష్ట్యాన్ని ఓర్చుకొన్న వారి సహనగుణాన్ని శ్లాఘిస్తూ ఇలా చెప్పాడు. క్షమాగుణం సకల శాస్త్రాలలోనూ అత్యుత్తమగుణంగా శ్లాఘించబడింది.*

**క్షమయ జనుల కాభరణము, క్షమయ కీర్తి,**
**క్షమయ ధర్మంబు, క్షమయ సజ్జనగుణంబు,**
**క్షమయ యజ్ఞంబు, క్షమయ మోక్షంబు, క్షమయ**
**సకలదానంబు, క్షమయందె జగము నిలుచు. (1-316)**

ప్రజలకు భూషణం క్షమయే అనగా సహనమే. కీర్తి గూడా సహనమే. పాటించదగిన ధర్మమూ క్షమయే. సజ్జనుల స్వభావంలోని ఉత్తమగుణం కూడా క్షమయే. క్షమయే యజ్ఞం, క్షమయే మోక్షం. సకలవస్తువులదానం కూడా క్షమయే. ఈ లోకం క్షమపైననే ఆధారపడి నిల్చియున్నది. అంచేత ఓర్పు గల్గియుండాలి.

## 6

*విశ్వామిత్రుని యాగసంరక్షణకై ఆ మునికోరికపై రామలక్ష్మణులు ఆయన ఆశ్రమానికి వెళ్ళారు. అక్కడ రక్కసులను హతమార్చి యాగాన్ని*

*రక్షించారు. ఆపై విశ్వామిత్రుడు వారిని జనకుడు చేస్తున్న యాగం చూడడానికై మిథిలానగరానికి తీసుకుపోయాడు. జనకుని సమ్మతితో అక్కడ ఉన్న శివధనుస్సును రామునికి చూపి దానినెక్కు పెట్టమన్నాడు. అపుడు రాముడు అవక్రపరాక్రమంతో ఆ ధనువు నెక్కుపెట్టి అది విరిగిపోయేటట్లు చేసిన విషయం ఈ పద్యంలో వర్ణించబడింది. ఈ కారణంగానే రాముడు సీతను చేపట్టినాడు. సీతారామకల్యాణం వైభవంగా జరిగింది.*

**కలభం బాతతచండతుండమున వీఁకన్ శేషనాగేంద్రునిన్**
**బలిమిం బట్టిన భంగి రామధరణీపాలుండు కోదండమున్**
**బలుముష్టిన్ వడిఁబట్టి యెత్తి తెగ విస్ఫారంబుగాఁ జేసి ని**
**శ్చలుడై యల్లన లస్తకంబు వదలెం జాపంబు భగ్నంబుగన్. (1-680)**

ఏనుగుగున్న విస్తృతమై భీకరమైన తన తొండంతో పరాక్రమించి శేషుడనే సర్పరాజును బలంతో పట్టుకొన్నట్లు శ్రీరాముడు శివధనుస్సును బలమైన ముష్టితో శీఘ్రంగా పట్టుకొన్నాడు. దానిని పైకెత్తి చలనం లేకుండా నిల్చాడు. ఆ ధనుస్సు విరిగిపోయేటట్లు ఆ ధనుర్మధ్యభాగాన్ని లాగి వదలాడు.

# 7

*శ్రీరాముడు శివధనుర్భంగం చేసి సీతను చేపట్టాడు. వివాహం జరిగిన పిదప అతడు బంధువులతో గూడి అయోధ్యకు తిరిగి పోతూ వుండినాడు. రాముడు శివధనుస్సును విరిచినాడన్న వార్త విన్న పరశురాముడు కోపంతో వచ్చి రాముణ్ణి అడ్డగించాడు. తన వద్దనున్న చాపాన్ని సంధించమన్నాడు. దశరథుడు భయపడి వేడుకొన్నా వినక ఆ రాజును తిరస్కరించి రామునితో పరశురాముడన్న మాటలివి –*

*రాజులు గీజులు, రాములు గీములు అన్నమాటలు పరశురామునికి క్షత్రియులపట్లా విశేషించి దశరథసుతుడైన శ్రీరామునిపట్లా గల తిరస్కారభావాన్ని ప్రకటిస్తున్నవి.*



**రాజఁట! యంతమీద మఱి రాముఁడు దానఁట భీకరాజులన్**
**రాజుల ద్రుంచి తత్ప్రసృతరక్తములం బితృతర్పణక్రియల్**
**రాజిలజేసియున్న భృగురాముఁడు, తుచ్ఛమదాంధులైన యీ**
**రాజుల గీజులన్ వెడఁగురాముల గీములఁ జూచి సైఁచునే. (1-730)**

వీడు రాజకుమారుడట! పైగా ఇతని పేరుగూడా రాముడేనట! ఈ పరశురాముడు భయంకరమైన యుద్ధాలలో ఎందరో రాజులను సంహరించి వారి నెత్తురుతో పితరులకు తర్పణం చేసినవాడు. అట్టి ఈ పరశురాముడు నీచులూ, మదగర్వితులూ అయిన యీ రాముని వంటి రాజులనూ, గీజులనూ, వెర్రి రాములనూ, గీములనూ చూచి సహిస్తాడా!

# 8

*కైక కోరిన వరాల ప్రకారం రాముడు పదునాల్గు సంవత్సరాలు అరణ్యంలో నివసించవలసి వచ్చింది. సీత, లక్ష్మణుడు రామునితో గూడా అడవికి వెళ్ళడానికి నిర్ణయించుకొన్నారు. రాముడు సీతతోనూ, లక్ష్మణునితోనూ గూడి సుమిత్ర చెంతకు వచ్చాడు. జరిగిన విషయం ఆమెకు తెలియపఱచి తిరిగి వెళ్ళే సమయంలో సుమిత్ర శోకాగ్నితో చిత్తం దహింపబడుతుండగా కైక దుర్వృత్తినీ, దశరథుని కాముకత్వాన్నీ ఆక్షేపించింది. అప్పు డామెకు లక్ష్మణుడు నమస్కరించగా అతణ్ణి దీవించి ఈ మాటలు పలికింది.*

ఈ పద్యంలోని భావమే వాల్మీకి రామాయణంలో ఈ క్రింది శ్లోకరూపంలో కనిపిస్తున్నది.

రామం దశరథం విద్ధి, మాం విద్ధి జనకాత్మజామ్ ।
అయోధ్యా మటవీం విద్ధి, గచ్ఛ తాత! యథా సుఖమ్ ॥

**మనమున రాముని దశరథ**
**జననాయకుఁగాఁదలంపు జనకతనూజన్**

**ననుఁగా దలపుము; కానన**
**ము నయోధ్యగఁ దలఁపు మేఁగు ముదమునఁ దండ్రీ! (2-100)**

నాయనా! శ్రీరాముణ్ణి దశరాథమహారాజుగా మనస్సులో భావించు. జనకుని పుత్రియగు సీతను నీ తల్లినగు నన్నుగా తలంచు. నీవు ఇప్పు డెక్కడికి వెళ్తున్నావో, ఆ అడవినే అయోధ్యగా నిశ్చయించు. సంతోషంతో రాముని వెంట వెళ్ళు.

# 9

*శ్రీరాముడు తండ్రి ఆనతి ప్రకారం అరణ్యానికి వెళ్ళిన తరువాత దశరథుడు మిక్కిలిగా శోకానికి గురి అయ్యాడు. అతని కవసాన సమయం సమీపించింది. ఆ విషయం గ్రహించిన రాజు కౌసల్యతో పూర్వం జరిగిన ఒక వృత్తాంతాన్ని చెప్పాడు.*

*తాను చిన్నతనంలో నడిరాత్రివేళ సరయూనదీ తీరంలో శబ్దవేధి బాణాలతో మృగాలను కొట్టుండగా ఒక పుణ్యాత్ముడు వచ్చి నీటిలో కుండ ముంచాడు. ఘుమఘుమ ధ్వని రాగా ఏనుగు కావించిన శబ్ద మనుకొని దశరథుడు బాణం ప్రయోగించాడు. అది తగిలి ఆ కుండ ముంచినవాడు 'హా! నమశ్శివాయ' అన్నాడు. అతడు వృద్ధులూ, అంధులూ ఐన ముని దంపతుల కొడుకు. అతడు శోకించడం చూచి దశరథుడు చింతాక్రాంతు డైనాడు. ఇంతలో అతడు మరణించాడు. ఈ దుర్వార్తను రాజు అతని తల్లిదండ్రులకు తెలిపి తాను జేసిన తప్పిదాన్ని వారికి తెలియజేశాడు. వారిని వారి కుమారుని కడకు తీసుకుపోయాడు. అప్పుడు మరణించిన ఆ పుత్రుని పేర్కొని వృద్ధుడైన అతని తండ్రి విలపించినప్పటి కరుణరసభరితమైన పలుకులు ఈ పద్యంలో ఉన్నాయి.*

**హా యను నో కుమార యను నక్కట పల్కవదేమి పుత్ర పు**
**త్రా యనుఁ దల్లిఁ జూడుమను, ౘదమ్ముఁడ దూరఁగనాటెనే యమో**
**ఘాయతసాయకంబను నృపాధముఁడేటికి నేసెఁబట్టి ప**
**ట్టీ యను నీకు నీగతి ఘటించెగదే యనుదైవమా! యనున్. (2-218)**

హా! అంటాడు. ఓ కుమారా! అంటాడు. పుత్రా! ఇంతగా నేను పిలుస్తున్నా పలుకవేమి? అంటాడు. పుత్రా! నీ తల్లిని చూడు అంటాడు. నాయనా! అమోఘమైన ఆ సుదీర్ఘబాణం నీ శరీరంలో లోతుగా నాటుకొన్నదా? అంటాడు. పుత్రకా! నీచుడైన ఆ రాజు నిన్ను గురిచూచి ఎందుకిలా కొట్టాడు? అంటాడు. నీకు ఇట్టి దుర్గతి కలిగిందే అంటాడు. 'హా దైవమా!' అని వాపోతాడు.

# 10

*కైక కోరిన వరాల ననుసరించి శ్రీరాముడు జడలూ, చర్మమూ దాల్చి అడవులకు వెళ్ళాడు. సీత, లక్ష్మణుడు ఆయన ననుసరించి పోయారు. పుత్రవియోగ దుఃఖం భరించలేక దశరథుడు ప్రాణపరిత్యాగం చేశాడు. అంతవరకూ మేనమామ యింటనుండిన భరతశత్రుఘ్నులు అయోధ్యకు వచ్చి జరిగిన సంగతులన్నీ తెలుసుకొన్నారు. తన తల్లి కైక వల్లనే శ్రీరాముడు అడవులకు వెళ్ళవలసివచ్చిందని ఆమె మాటలతోనే తెలుసుకొన్న భరతుడామెను తూలనాడుతూ చెప్పిన పద్యమిది. 'రాక్షసీ' అని తల్లిని సంబోధించడం వల్ల భరతుడు రామునిపట్ల ఎంతప్రేమ, భక్తి కలవాడో తెలుస్తున్నది.*

**అడవుల రామచంద్రుఁడు జటాజినముల్ ధరియించియుండ నే**
**బుడమి భరించి భోగములఁ బొందగలానటె! యిట్టి చొప్పులే**
**యెడఁ గలవింక నన్న మొగ మేమి తెఱంగున జూతుఁ బాపపుం**
**గడుపునఁబుట్టి యీ భువనగర్హకుఁబాత్రుఁడ నైతి రాక్షసీ! (2-230)**

ఓ రాక్షసీ! అన్న రామచంద్రుడు జడలూ, జింకచర్మమూ ధరించి అడవులలో ఉండగా నేను రాజ్యభోగాలు అనుభవించగలనా? ఇలాంటి

పరిస్థితు లెక్కడైనా ఉన్నాయా? ఇంత జరిగిన తరువాత ఇక మీదట నేను మా అన్న ముఖం ఎలా చూచేది? పాపపంకిలమైన నీ కడుపున బిడ్డగా పుట్టి నేను ఈ లోకనిందకు పాత్రుడ నయ్యాను గదే!

## 11

*శ్రీరాముడు సీతతోనూ, లక్ష్మణునితోనూ గూడి వనవాసం చేసే కాలంలో ఒక పర్ణశాలలో నివసించాడు. ఒకనా డాయన ఆ పర్ణశాలలో జానకీదేవితో సరససల్లాపాలు చేస్తుండగా రావణుని చెల్లెలు శూర్పణఖ అక్కడికి వచ్చింది. ఆమె రాముణ్ణి చూచి ఆయన అందచందాలు మెచ్చుకొంటూ చెప్పిన మాట లివి.*

**రేకు లన్నియు విచ్చి రే యెండ జిగినిండి**
**కరమొప్పు తెల్ల దామరలకంటె**
**నఱలేని నెఱదీప్తి మెఋఁగెక్కి సరిమింటఁ**
**జరియించు సంపూర్ణచంద్రుకంటె**
**నునుఁదీఁగ జిగిఁదోఁగి ననుపార నిగ్గారి**
**తనరు దిక్కరుల హస్తములకంటె**
**నిగిడి చేరువలెల్ల నీలోత్పలద్యుతుల్**
**పచరించు హరినీల రుచులకంటె**

**నితని కన్ను లొప్పు నీ రాజు మోమొప్పు**
**నితని కరము లొప్పు నితని మేని**
**కాంతి యొప్పు ననుచుఁ గడువేడ్క నన్నిశా**
**చరిణి చూచె రామచంద్రుఁ దవిలి. (3-1-135)**

దళా లన్నీ విచ్చుకొని వెన్నెల సొబగుతో నిండి మిక్కిలిగా విలసిల్లే తెల్ల దామరపూలకంటే అందంగా ఇతని కన్నులు ప్రకాశిస్తున్నాయి. కొఱతలేని నిండు వెలుగుతో కాంతి అతిశయించి ఆకాశంలో సంచరించే



పున్నమినాటి చంద్రునికంటే సుందరంగా ఈ రాజకుమారుని ముఖం భాసిస్తున్నది. లేత దీగకు గల నైగనిగ్యం కలిగి నున్ననివై విరాజిల్లే దిగ్గజాల తొండాలకంటే ఎక్కువ శోభతో ఇతని చేతులు విలసిల్లుతున్నాయి. విస్తరించి సమీప ప్రదేశా లన్నిటా నల్ల గలువ కాంతులు విస్తరింపజేసే ఇంద్రనీలమణుల దీప్తులకంటే అధికంగా ఇతని శరీరకాంతి వెలుగొందుతున్నది. ఇలా అంటూ ఆ రాక్షసి శూర్పణఖ మిక్కిలి కౌతుకంతో ఆసక్తి కలిగి రామచంద్రుణ్ణి చూచింది.

## 12

*వనవాసంలో ఉన్న సీతాసమేతులైన రామలక్ష్మణులను రావణుని చెల్లెలైన శూర్పణఖ చూచింది. ఆమె శ్రీరాముని సౌందర్యం చూచి ఆయనను కామించింది. నీతి దప్పి ప్రవర్తించిన ఆ రాక్షసిని బట్టి లక్ష్మణుడు ముక్కు, చెవులు కోసివేశాడు. అలా భంగపడిన ఆ శూర్పణఖ ఆక్రోశంతో ఖరుని చెంతకు పరుగిడి వెళ్ళి ఏడ్చింది. అప్పుడు ఖరుడనే ఆ రక్కసుడు చెప్పిన మాట లివి.*

**ఎవ్వఁడొకో లయాంతకుని నేనని మార్కొని కోఱ మీటె వాఁ**
**డెవ్వఁడొకో పురాంతకుని యెక్కుడు కన్నఱకాలదన్నెఁ దా**
**నెవ్వఁడొకో సమిత్రముగ నిప్పుడ చావఁ దలంచె నింత వా**
**డెవ్వఁడొ వానిపేరె ఱిఁగి యిప్పుడ చెప్పుము నూతి మ్రింగెదన్. (3-1-158)**

ప్రళయాంతకుడైన యముణ్ణి తన పేరు చెప్పి ఎదుర్కొని అతని కోఱ మీటిన ఆ బుద్ధిహీను డెవడు? త్రిపురాలను దహింపజేసిన పరమశివుని మూడవ కంటిని అరికాలుతో తన్నిన ఆ పొగరు బోతు ఎవడు? తన మిత్రులతో సహా ఇప్పుడే చావడానికి సిద్ధమైన ఆ మూర్ఖు డెవడు? వా డెవడో వాని పేరు తెలుసుకొని ఇప్పుడే చెప్పు. ఆ దుష్టుణ్ణి పచ్చడిగా నూరి మ్రింగివేస్తాను.

# 13

*శ్రీరాముణ్ణి చూచి మోహించిన శూర్పణఖకు కోరిక తీరలేదు. పైగా అది ముక్కు, చెవులు లేనిదయింది. ఆ అవమానం భరించలేక తన సోదరుడైన రావణుని వద్దకు పోయింది. అకంపనుడు ఆమెకంటే ముందే పోయి రాముని వృత్తాంతం రావణునికి తెలియజేశాడు. పిదప రావణుని చెంతకు వచ్చిన శూర్పణఖ తనకు గల్గిన పరాభవాన్ని అతనికి తెలియజేసింది. అతనికి సీతారామలక్ష్మణుల వృత్తాంతం వివరించింది. సీతపై రావణునికి ప్రేమ పుట్టాలన్న ఉద్దేశంతో ఈ పద్యంలో సీత అందచందాలను అతనికి వర్ణించి చెప్పింది. సీతాదేవియొక్క లోకాతీత సౌందర్యం ఇందులో వర్ణించడమయింది.*

**విదియ చందురుఁడైన వెలఁది నెమ్మోమునఁ**
**గలిసిన సంపూర్ణ కాంతి వడయు,**
**వడగాలి యైన నప్పడఁతి యూర్పుల చెంతఁ**
**బరఁగిన మలయాద్రి పవనుఁబోలు**
**నమవస యిరులైన నయ్యింతి చిరునవ్వు**
**సొలపున వెన్నెల చెలువు బూను**
**నలరి యే ఋతువుల నైన నా సతి మేని**
**ప్రభ గన్న వనములు పల్లవించు**

**బట్ట బయలైన నా సితపద్మనేత్ర**
**కన్నుఁ గవయొప్పు జిగిసొంపు గడలు కొనిన**
**విమలకమలషండంబుల విధము నొందు**
**నెందు సరి వోల్పఁగలరె యయ్యిందుముఖికి. (3-1-278)**

విదియనాటి చంద్రుడైనా అందమైన ఆ సీత ముఖంతో కలిస్తే పరిపూర్ణమైన కాంతిని పొందుతాడు. వేడివేడి వడగాలి యైనా ఆ వనిత నిశ్వాసం వద్ద ప్రసరిస్తే మలయపర్వతమునందలి గాలివంటి దవుతుంది.



అమావాస్య నాటి చీకట్లైనా ఆ కాంతయొక్క చిరునవ్వుతో కలిస్తే వెన్నెల శోభను సంతరించుకొంటాయి. ఆ ఋతువూ, ఈ ఋతువూ అనకుండా ఏ ఋతువులలో నైనా ఆ సీత ఒడలి కాంతిని పొందితే వనాలు చిగిరిస్తాయి. శూన్యప్రదేశమైనా తెల్లదామరల వంటి కన్నులు గల ఆ సీతాదేవి నేత్రద్వయం సొంపు, సౌందర్యం వ్యాపిస్తే నిర్మలమైన తామరల రీతిగా భాసిస్తుంది. ఇలా పరిశీలిస్తే చంద్రునివంటి ముఖం గల ఆ జానకికి సాటి రాగలవా రెవరూ లేరు.

# 14

*సీత తీగవలె కృశించిన శరీరం కలదనీ, కోకిలవలె మనోహరంగా పలుకుతుందనీ, జింకవలె చలించే కన్నులు గలదనీ, నెమలిపింఛంలాగా నీలమైన కేశపాశం కలదనీ, గాలికి కదిలే చివురు వంటిదనీ – ఇందలి వర్ణన గమనింపదగియున్నది.*

*రావణుడు సీతను అపహరించాడు. పర్ణశాలలో ఆమెను చూడజాలక రాముడు సీతావియోగంతో పరితపించాడు. లక్ష్మణునితో గూడి ఆమెను వెదకసాగాడు. ఆయన మతి చలించింది. ఒక వస్తువును జూచి మరొక వస్తువుగా భావించునంతటి భ్రాంతికి లోనయ్యాడు. ఆ సందర్భములో కవి రాముని యొక్క వియోగావస్థను ఇలా వర్ణించాడు.*

**అదె చలత్తన్వంగి యనుచు నల్లన చేర**
**నది చూతలతయైన నట్ల నిలుచు**
**నదె మంజులాలాప యనుచు నల్లన చేర**
**నది కోకిలంబైన నట్ల నిలుచు**
**నదె లోలలోచన యనుచు నల్లన చేర**
**నది కురంగంబైన నట్ల నిలుచు**
**నదె నీలకుంతల యనుచు నల్లన చేర**
**నది మయూరంబైన నట్ల నిలుచు**

**నదె మహీజ నన్ను నచటికై చేసన్న**
**చేసె ననుచు నల్లఁజేర నదియు**
**లలిత మలయ పవన చలిత పల్లవమైన**
**నట్ల నిలుచు రాముఁడచట నచట. (3-2-275)**

సీత నన్వేషిస్తూ అదిగో కదిలే కృశాంగి అంటూ సీతయని భావించి రాముడు ఒక తీగ చెంతకు పోగా, అది సీతకు బదులు మామిడి తీవయై కనిపించింది. అట్లే నిలిచాడు. అదిగో మనోజ్ఞంగా మాట్లాడే నా సీత అంటూ సమీపించి చూడగా అక్కడ సీతకు బదులు కోకిల దృష్టి గోచరమయింది. మళ్ళీ నిలబడ్డాడు. అదిగో చంచలమైన కన్నులుగల నా సీత అంటూ మెల్లగా సమీపించగా అక్కడ సీతకు మారుగా ఒక జింక కనిపించింది. మళ్ళీ అతడట్లే నిలిచిపోయాడు. అదిగో నల్లని వెండ్రుకలు గల నా సీత అని తలచి దాన్ని సమీపించగా అక్కడ సీతకు బదులు నెమలి సాక్షాత్కరించింది. మళ్ళీ అలాగే నిల్చిపోయాడు. అదిగో భూపుత్రి సీత నన్ను రమ్మని చేతి సంజ్ఞతో పిలుస్తున్నది అనుకొని ఆ వైపు పోగా అక్కడ సీత లేదు, ఆమెకు మారుగా లలితమైన మలయగిరినుండి వీచే గాలికి చలించే చిగురు కనిపించింది. ఇలా భ్రాంతికి గురి అయిన శ్రీరాముడు సీత నన్వేషిస్తూ పోయిపోయి ఆమెను చూడజాలక అక్కడక్కడా నిల్చి నిల్చి ఆమెకై తపనపడ్డాడు.

## 15

*రావణుడు సీతను అపహరించిన తరువాత ఆమె నన్వేషిస్తూ రామలక్ష్మణులు ఆ వనమంతటా కలయదిరిగారు. రాముడు తీవ్రశోకానికి లోనై విలపించాడు. అతని దుఃస్థితిని చూచి శోకం తగదంటూ లక్ష్మణుడు చెప్పిన మాటలివి.*



**శోకము బొందినవానిన్**
**భీకర రోగములు సెందుఁ బృథులార్థంబుల్,**
**సేకురవు వాని కెప్పుడు**
**శోకము గని విడుచువాఁడు సుజ్ఞాని నృపా! (3-2-321)**

ఓ రాజా! ఎవడు శోకానికి గురి అవుతాడో, వాణ్ణి భయంకరమైన రోగాలు పట్టి పీడిస్తాయి. శోకించేవానికి గొప్ప ప్రయోజనా లేవీ సిద్ధించవు. శోకంయొక్క దుఃస్థితి ఇట్టిదని తెలిసికొని ఆ శోకాన్ని వదలిపెట్టువాడు మంచి జ్ఞాని అనబడతాడు. అందువల్ల నీవు శోకించవద్దు అని భావం.

## 16

*సీతా వియోగంతో పరితపిస్తున్న శ్రీరామునితో లక్ష్మణుడు చెప్పిన మాటలివి. పై పద్యానికి చెప్పిన సందర్భమే దీనికి గూడా అన్వయిస్తుంది.*

**ఆపద సమస్తలోకులఁ**
**బ్రాపించుఁ దొలంగు నపుడ పవనము భంగిన్,**
**బైపడు నాపద సైఁచిన**
**భూపాలా! క్షణములోనఁ బొందు శుభంబుల్. (3-2-343)**

రాజా! వారూ, వీరూ అనక సకల జనులకూ ఆపద కల్గుతుంది. మరల అపుడే గాలి లాగా వచ్చిన ఆపద తొలగిపోతుంది. అలా మీదబడిన ఆపదను సహించగల్గితే క్షణకాలంలోనే మళ్ళీ శుభాలు చేకూరుతాయి. అందువల్ల ఆపదను సహించడం ఎంతైనా అవసరం.

## 17

*సుగ్రీవునితో మైత్రి కుదుర్చుకొన్న శ్రీరాముడు తన మాటప్రకారం వాలిని వధించాడు. ఇప్పుడు సుగ్రీవుడు కిష్కింధకు రాజైనాడు. రామునితో సఖ్యం కుదిరినప్పుడు 'రామా! ఇంక వగవవద్దు. నీ సతిని ఆమె ఏ లోకంలో*

*ఉన్నా నీ చెంతకు వడిగా తెచ్చే బాధ్యత నాది’ అని మాట యిచ్చినాడు. కాని రాజ్యాధికారం దక్కగానే ఆ మాట మరచాడు. స్త్రీ లోలుడై కామసుఖం అనుభవింపసాగాడు. ఆ విషయాన్నే రాము డిక్కడ లక్ష్మణునితో ప్రస్తావించాడు. ఆపై సుగ్రీవుని కర్తవ్యాన్ని గుర్తింప చేయడానికై లక్ష్మణుని కిష్కింధకు పంపుతాడు.*

**ధరణీరాజ్యముఁగోలుపోయి ప్రియకాంతం బాసి యత్యంత దు**
**స్తర శోకాగ్ని మనంబు గ్రాఁగఁగఁ బ్రవాసం బొంది యేనుండఁగా**
**స్మరకేళీ వ్యసనైక చిత్తమున భామామగ్నుఁడై నా యెడం**
**బురుషార్థక్రియ దక్కినాఁడు దినకృత్పుత్రుండు కామాంధుఁడై. (4-416)**

శ్రీరాముడు సుగ్రీవుణ్ణి ఉద్దేశించి లక్ష్మణునితో ఇలా అన్నాడు –

నేను మహీరాజ్యం పోగొట్టుకొన్నాను. నాకెంతో ప్రియమైన సీతతో వియోగం పొందాను. తరింపరాని దుఃఖాగ్నితో నా మనస్సు పరితప్తమయింది. అయోధ్యానగరం వీడి వనానికి వచ్చి ప్రవాసంలో ఉన్నాను. ఇట్టి స్థితిలో నేనుండగా సూర్యతనయుడైన సుగ్రీవుడు మదనక్రీడాపరమైన మనస్సు గల్గి కామంతో గ్రుడ్డివాడై, స్త్రీలోలుడై నా విషయములో ఇచ్చినమాట నిలబెట్టుకోవాలన్న పురుషార్థానికి చెందిన కర్తవ్యకార్యం పరిత్యజించాడు.

## 18

*శ్రీరాముడు సుగ్రీవుని మిత్రుడై ఇచ్చిన మాట ప్రకారం వాలిని వధించాడు. దానితో సుగ్రీవుడు తాను పోగొట్టుకొన్న కిష్కింధా రాజ్యానికి మరల రాజైనాడు. ఆ రీతిగా రాముడు సుగ్రీవునికి మహోపకారం చేశాడు. సుగ్రీవుడు తిరిగి రామునికి సీతాన్వేషణ అనే ఉపకారం చేయవలసియున్నాడు. అలా చేస్తానని పూర్వం చెప్పాడు గూడా – కాని అలా చేయక స్త్రీ లోలుడై కామసుఖానుభవంలో మగ్ను డయ్యాడు. లక్ష్మణుని కిష్కింధకు పంపుతూ రాముడు అతనితో ఈ విషయం ప్రస్తావించి తన వాక్యంగా ఈ విషయం చెప్పుమన్నాడు సుగ్రీవునికి.*



**ఉపకృతుఁడై యుపకారికి**
**నుపకారం బిచ్చుఁజేయకుండు కృతఘ్నుం**
**డపగతుఁడైనం దద్గా**
**త్రపరీతామిషముఁ దినవు క్రవ్యాదములున్. (4-474)**

ఒకనిచేత ఉపకారం పొందినవాడై ఆ ఉపకారం చేసినవానికి ప్రత్యుపకారం బుద్ధిపూర్వకంగా చేయకుండా ఉండే కృతఘ్నుడు మరణిస్తే అతని శరీరంలోని మాంసాన్ని మాంసభక్షణ చేసే క్రూరమృగాలు గూడా తినవు.

## 19

*రాజ్యాధికారం సిద్ధించిన తరువాత సుగ్రీవుడు సీతాన్వేషణ రూపమైన తన కర్తవ్యాన్ని విస్మరించాడు. ఆ విషయాన్ని అతని స్మృతికి దేవలసినదని రాముడు లక్ష్మణుణ్ణి సుగ్రీవుని చెంతకు పంపాడు. లక్ష్మణుడు కోపంతో సుగ్రీవుని వద్దకు వెళ్ళి అతని కర్తవ్యాన్ని గూర్చి హెచ్చరించాడు.*

*అప్పుడు తార లక్ష్మణుని కోపాన్ని శమింపజేసింది. అంతట సుగ్రీవుడు కర్తవ్యోన్ముఖు డవుతాడు. అయినా రాముడు తనపై ఆగ్రహిస్తాడేమో అని శంకించాడు. అపుడు హనుమంతుడు అతని భయం తొలగిస్తూ చెప్పిన వచనా లివి.*

**రాముఁడు నిత్యసత్యుఁడు శరణ్యుఁడు న్యాయపరుండుఁ ద్రాతయున్**
**స్వామియు ధర్మవత్సలుఁడు సత్యసమేతుఁడు గాన పాపహిం**
**సామతి గాఁడు లక్ష్మణుఁడు చాల సహాయుఁడు గాగఁ జన్న ని**
**న్నేమియుఁ జేయఁ డర్కసుత! యేగుము వేగమ రాము పాలికిన్. (4-517)**

శ్రీరాముడు నిత్యమూ సత్యం పాటించేవాడు. అందరికీ శరణొంద దగినవాడు. న్యాయంపై ఆసక్తి గల్గినవాడు. సర్వులనూ రక్షించువాడు,

అందరికీ ప్రభుడు, ధర్మం పట్ల ప్రీతి గలవాడు, సత్యంతో కూడినవాడు. అందుచేత అతడు పాపులను హింసించాలన్న బుద్ధి గలవాడు కాడు (పాపకార్యమైన హింసాబుద్ధిగలవాడు కాదు), నీవు ఈ లక్ష్మణుణ్ణి తోడుగా దీసుకొనిపోయినావంటే, ఆ రాముడు నిన్ను ఏమీ చేయడు. సూర్యపుత్రుడవైన సుగ్రీవా! వెంటనే రామునిచెంతకు పొమ్ము.

# 20

*సుగ్రీవుని ఆజ్ఞ మేరకు వానరవీరులు నలుదెసలా సీతాన్వేషణ కావించడానికి బయలుదేరి వెళ్ళారు. అంగదుడు, జాంబవంతుడు, హనుమంతుడు మున్నగు వీరులు దక్షిణదిశకు వెళ్ళారు. అక్కడ సంపాతి వారికి సీత ఉన్నచోటును గూర్చి తెలిపాడు. సముద్రం దాటి లంకకు పోయి సీతను చూడవలసిన పరిస్థితి సంభవించింది. వానరవీరులు సముద్రం దాటి మరల తిరిగి వచ్చే విషయంలో తమకు గల సామర్థ్యం, బలసంపద యెట్టిదో ఒకరొక్కరుగా వివరించారు. వారిలో ఏ ఒక్కరూ ఆ పనిలో విజయం పొందలేరని తేలింది. హనుమంతుడు మాత్రం ఏమీ చెప్పకుండా ఊరకుండిపోయాడు. అప్పుడు జాంబవంతుడు అంగదాదులతో సీతను దర్శించి తిరిగి రాగలవాడు ఒక్క ఆంజనేయుడే అని చెబుతూ ఈ వచనాలు పలికాడు.*

**రామహితంబుసేయఁ గపిరాజగు భానుజు పంపొనర్ప ను**
**ద్దామజవంబునన్ జలధి దాఁటఁగ, లంక సొరంగ, దక్షతన్**
**భూమిజఁ జూచిరాఁ గలుగు భూరి పరాక్రమశాలి వానర**
**గ్రామణి వాయునందనుఁడు గల్గఁగ నేరికిఁజింత యేటికిన్. (4-791)**

శ్రీరామునికి హితం చేకూర్చడానికీ, వానరులకు అధిపతియైన సుగ్రీవుని ఆనతిని నెరవేర్చడానికీ, అడ్డులేని మహావేగంతో సముద్రం



దాటడానికీ, లంకానగరం ప్రవేశించడానికీ, సమర్థతతో భూపుత్రియైన సీతను చూచి తిరిగి రావడానికీ అన్నివిధాలా సమర్థుడైన మహావిక్రమం కలవాడూ, వానరశ్రేష్ఠుడూ అయిన వాయుసుతుడగు హనుమంతుడు ఉండగా ఎవరికైనా ఇక చింత ఎందుకు?

# 21

*హనుమంతుడు సముద్రం దాటి లంకలో ప్రవేశించి సీతకొరకై అన్వేషించాడు. అక్కడ ఒక దివ్య విమానంలో నిద్రించే పెక్కుమంది స్త్రీలను చూచాడు. అక్కడ ఒకచోట నిద్రిస్తున్న రావణుణ్ణి గూడా విలోకించాడు. అతని చెంత నున్న మండోదరిని చూచి సీత అనుకొన్నాడు. మళ్ళీ ఆలోచించి ఈమె సీత కాదు, సీత అయితే ఆ మహాసాధ్వి రావణుని చెంత శయనించదు గదా! అని తనలో తాను ఆత్మవిమర్శ చేసుకొన్నాడు. ఈ పద్యం ఆ సందర్భంలోనిది.*

**ధరణిజ పుణ్యసాధ్వి వినుతవ్రత పావని సీత లోకసుం**
**దరి త్రిదశేంద్రవంద్య గుణధాముని రామునిఁబాసి యన్యకా**
**పురుషుల శయ్యపై నిదురవోవునె పుష్పసుగంధభూషణో**
**త్కరములు దాల్చునే మధువు ద్రావునె భోగము లిచ్ఛగించునే? (5-112)**

భూపుత్రియైన సీత పవిత్ర సాధుశీల, ప్రశస్తమైన నియమం కలది, పరమ పావన చరిత్ర, లోకప్రసిద్ధమైన సౌందర్యం కలది, దేవతల కధిపతియగు ఇంద్రునిచే నమస్కరింపదగినది. అట్టి జానకి సద్గుణ నిలయుడైన శ్రీరాముని వదలి కుత్సితులైన ఇతర పురుషుల పడకపై నిద్రిస్తుందా? పువ్వులు, సుగంధద్రవ్యాలు, వివిధాలైన భూషణాలు ధరిస్తుందా? మద్యం త్రాగుతుందా? భోగాలు ఇష్టపడుతుందా?

## 22

*సీతాన్వేషణకై లంకలో ప్రవేశించిన హనుమంతుడు ఆమెకై వెదకుతూ అక్కడ పలు ప్రదేశాలు చూచాడు. ఎక్కడా సీత జాడ కనిపించలేదు. రావణునితో నిద్రిస్తున్న మండోదరిని చూచి సీత అని భ్రమించి మరల ఆమె సీత కాదన్న నిశ్చయానికి వచ్చాడు. సీత కనిపించనందుకు చింతించాడు. ఆ స్థితిలో అల్లంత దూరంలో అతనికి అశోకవనిక కనిపించింది. అక్కడ సీత ఉండవచ్చు నని భావించి తన ప్రయత్నం సఫలం కావడానికై శివకేశవాది దేవతలను స్మరించి వారికి ప్రణామాలు ఘటించాడు. ఆ సందర్భంలోని పద్యమిది.*

**వాయుతనూజుఁడప్పుడు శివాయ రమారమణాయ భారతీం**
**ద్రాయ! సురేశ్వరాయ! పవనాయ! పయోరుహబాంధవాయ! చం**
**ద్రాయ! వినాయకాయ! శమనాయ! సమీరసఖాయ! పాశహ**
**స్తాయ! నమో! నమో! యనుచు దక్షత వారికి మ్రొక్కి వెండియున్. (5-129)**

అప్పుడు వాయుదేవుని కుమారుడైన ఆంజనేయుడు 'శివునికీ, లక్ష్మీరమణుడగు విష్ణువుకీ, సరస్వతీనాథుడైన బ్రహ్మకూ, దేవతల ప్రభువైన ఇంద్రునికీ, వాయుదేవునికీ, పద్మాలకు బంధువైన సూర్యునికీ, చంద్రునికీ, వినాయకునికీ, యమునికీ, గాలికి మిత్రుడైన అగ్నికీ, పాశంచేత బూనిన వరుణునికీ నమస్కారం, నమస్కారం' అంటూ ఆయా దేవతలకు దక్షతతో మ్రొక్కాడు. తరువాత తక్కిన వసురుద్రాదులకు గూడా వందనాలు ఘటించాడు.

## 23

*సీతాన్వేషణకై లంకకు వెళ్ళిన హనుమంతుడు అచ్చట అశోకవనికలో ఆమెను దర్శించాడు. ఆమెకు రాము డిచ్చిన ఆనవాలు సమర్పించి రాముని*



*కివ్వడానికి ఆమెనుండి ఆనవాలు పరిగ్రహించాడు. ఆపై అశోకవనాన్ని భగ్నం చేశాడు. రాక్షసులు యుద్ధానికి రాగా పెక్కుమందిని హతమార్చాడు. తుదకు ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రానికి బద్ధు డయ్యాడు. రాక్షసు లతణ్ణి రావణుని చెంతకు తీసుకుపోయారు. అప్పు డతడు ఆ రాక్షసరాజుకు హితముపదేశిస్తూ సీతను రామునికి ఒప్పగించమని చెప్పాడు. ఆ సందర్భంలోని పద్యమిది.*

**నీ కంఠార్పితకాలపాశము శిరోనిర్ఘాతపాతంబు లం**
**కౌక స్సంచయకాళరాత్రి గళబద్ధోదగ్రకాలాహి క**
**న్యాకారాగత మృత్యువున్ జనకకన్యన్ వేగయొప్పించి లో**
**కైకత్రాణుని రామునిం గనుము నీకీబుద్ధి గాకుండినన్. (5-448)**

రావణా! ఈ సీతాదేవి నీ మెడకు దగిలించిన యమపాశం, నీ నెత్తిపై పిడుగుపాటు, లంకలో నివసించే రక్కసుల పాలిట కాళరాత్రి, నీ మెడకు గట్టుకొన్న భయంకరమైన కాలసర్పం, కన్య అనే ఆకారంతో నీ చెంతకు వచ్చిన మృత్యువు సుమా! వెంటనే ఈ జనకపుత్రిని ఆమె భర్తయగు శ్రీరాముని కొప్పించి లోకైకరక్షకుడైన ఆయనను దర్శించు. నీకు ఇట్టి మంచిబుద్ధి నచ్చకపోతే... (నీకూ, నీ లంకకూ హాని తప్పదు అని భావం)

## 24

*సీతను వెదకడానికై వెళ్ళిన వానరులలో దక్షిణదిశకు వెళ్ళిన ఆంజనేయుడు సముద్రందాటి లంకలో ప్రవేశించి అక్కడ అశోకవనికలో సీతను దర్శించాడు. ఆ వనాన్ని భగ్నం చేసి రావణుణ్ణి చూచి అతనికి నీతి బోధించాడు. ఆపై లంకను కాల్చి తిరిగి సముద్రందాటి వచ్చి సీతను చూచాను అని రామునికి చెప్పి ఆమె ఇచ్చిన చూడామణిని ఆయన కర్పించాడు. దీనితో సుందరకాండ కథ ముగిసింది. యుద్ధకాండ ప్రారంభంలో శ్రీరాముడు హనుమంతుని కార్యసామర్థ్యాన్ని శ్లాఘిస్తూ ఇలా అన్నాడు.*

**ఉత్తముఁడేలు తేని పని యొక్కరుఁడయ్యును జేయు మధ్యముం**
**దత్తి యొనర్చుఁ దోడు గల యప్పుడు చాలియు నీచుఁడెప్పుడున్**
**జిత్తముసేయఁ డత్తెఱంగు సేయుటకై యసహాయశూరుఁడ**
**త్యుత్తమభృత్యుఁ డీకపికులోత్తముఁ బోలుదురెట్టు లెవ్వరున్. (6-4)**

ఒక రాజు ఆదేశించిన పనిని ఉత్తముడైన వాడు ఒక్కడుగా ఉండినా నెరవేరుస్తాడు. మధ్యముడైనవాడు తానొక్కడే చేయజాలక తనకు తోడ్పడే వారెవరైనా లభిస్తే వారి సహాయంతో ఆ పని నిర్వహిస్తాడు. నీచుడగు జనుడు తాను చేయగల సమర్థుడై యుండికూడా ఎప్పుడూ దానిపై మనస్సుంచి ఆ పని చేయడు. ఎవరి సహాయమూ అక్కరలేని శూరుడైనవాడూ, సేవకులలో మిక్కిలి శ్రేష్ఠుడూ, వానరకులంలో మిక్కిలి ఉత్తముడూ అయిన ఈ అంజనాతనయునితో సాటి రాగల వారెవరున్నారు?

## 25

*శ్రీరాముడు యుద్ధరంగంలో రావణునితో సహా దుష్టరాక్షసుల నందరినీ వధించాడు. విభీషణుణ్ణి లంకా రాజ్యంలో అభిషిక్తుణ్ణి చేశాడు. విభీషణుడు సీతను రాముని చెంతకు తీసుకొని రాగా ఆమె శీలపరీక్షకై అగ్నిప్రవేశం చేసి తాను శీలవతినని నిరూపించుకొన్నది. ఇంద్రాది దేవతలు రాముణ్ణి స్తుతించారు. సీతను తెచ్చి అగ్నిదేవుడు రామునికొప్పించాడు. ఇంత జరిగినా రామునిలో సీతా విషయమై అభిప్రాయం పూర్తిగా మారలేదు. అప్పుడగ్ని దేవుడు సీత పరమపతివ్రత అని సమర్థిస్తూ ఆమెపై శ్రీరామునికి విశ్వాసం కలగడానికై చెప్పిన వచనా లివి.*

**మందారభూజంబు మరగిన భృంగికిఁ**
**బిచుమందశాఖిపైఁ బ్రేమ గలదె**
**లలి మానసంబున మెలఁగైడి హంసికి**
**వెలయఁ బల్వలముపై వేడ్క గలదె**



**మలయద్రుమంబున మలయు భుజంగికి**
**బర్బురతరువుపై వలపు గలదె**
**భాస్కరోదయమున భాసిల్లు పద్మిని**
**కిందుకరస్పృష్టి నెలమి గలదె**
**రాజితానేకసద్గుణారామ! రామ**
**ధర్మపాలన పరమ నీ ధర్మపత్ని**
**యైన సాధ్వికి సీతకు నన్యునందుఁ**
**గూర్మి యేచందమున సమకూడు నయ్య! (6-2401)**

మందారవృక్షంలోని మకరందాన్ని ఆస్వాదించడానికి అలవాటు పడిన ఆడు తుమ్మెదకు వేపచెట్టుమీద ప్రేమ ఉంటుందా? మానససరస్సులో వినోదంగా మెలగే హంసికి చిన్న నీటిపడియలపై ఆసక్తి ఉంటుందా! చందనవృక్షంపై విలసిల్లే ఆడు పాముకు బర్బురవృక్షంమీద ప్రేమ ఉంటుందా? సూర్యోదయకాలంలో ఆ కిరణస్పర్శకు వికసించే పద్మినికి చంద్రుని కిరణాల స్పర్శపై ప్రీతి ఉంటుందా? ప్రకాశించే పెక్కు సద్గుణాలకు నెలవైన ఓ రామా! ధర్మపరిపాలనచే విరాజిల్లే పరమపురుషా! నీ ధర్మపత్ని అయిన సీతాదేవికి ఇతర పురుషునియందు ఎలా ప్రేమ కల్గుతుందయ్యా?

## 26

*శ్రీరాముడు అరణ్యవాసమునుండి అయోధ్య చేరిన తరువాత అతని స్థితిని వర్ణించే పద్య మిది. ఈ ప్రపంచం సుఖదుఃఖాలతో గూడింది. సుఖం వస్తే పొంగిపోవడం, దుఃఖం కల్గితే క్రుంగిపోవడం సామాన్య మానవుని స్వభావం. కాని స్థితప్రజ్ఞులైన మహనీయులు సుఖదుఃఖాలను సమానంగా భావిస్తారు. అట్టి భావన గల శ్రీరాముణ్ణి వర్ణించే పద్య మిది.*

**జనకుని పంపున నడవికి**
**జనునప్పుడు నేఁడు మగిడి జనతతు లలరన్**
**జను దెంచునపుడు నానన**
**వనజము రుచి యొక్క రూప వర్ణింపంగన్. (6-2611)**

శ్రీరాముడు తండ్రి ఆనతి తలదాల్చి అరణ్యవాసానికి వెళ్ళాడు. మరల పదునాల్గు సంవత్సరాలు దాటిన తరువాత అయోధ్యకు వచ్చాడు. ఆయన రావడాన్ని చూచి అయోధ్యానగరవాసులు ఎంతో సంతోషించారు. పూర్వం అడవికి పోయే సమయంలో గానీ, ఇప్పుడు తిరిగి వచ్చినప్పుడు గానీ ఆ రాముని ముఖపద్మం యొక్క కాంతి వర్ణించి చెప్పడానికి ఒకే తీరున ఉండింది. అందులో ఏ మార్పు లేకపోవడం ఆశ్చర్యకరం. సుఖదుఃఖాలను సమంగా చూచే ఈ స్థితప్రజ్ఞలక్షణం రాముని మహానుభావత్వాన్ని స్పష్టం చేస్తున్నది.

* * *

*శ్రియఃకాన్తాయ కల్యాణనిధయే నిధయేఽర్థినామ్ ।*
*శ్రీవేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ ॥*